ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 28.0
కనిష్ఠం : 25.0


స్టోర్‌రూమ్‌లో బియ్యాన్ని పరిశీలిస్తున్న జేసీ

వారి ధైర్యం ఏమిటి!?



- నాణ్యత లేని ఆహారం పెడుతున్నా.. తినాల్సిందేనా..!
- అధికారులు, మెస్ నిర్వాహకుల బంధం ఏమిటి ?
- పేరుకే మెస్ కమిటీలు.. వీరి ఫిర్యాదును పట్టించుకునేదెవరు ?
- సెక్యూరిటీ లోపాలతో.. గాలిలో విద్యార్థుల భద్రత

నూజివీడు/నూజివీడు టౌన్, ఆగస్టు 30: నూజివీడు ట్రిపుల్ ఐటీ అనేక సమస్యలతో కునారిల్లుతోంది. గత ప్రభుత్వంలో పాలకులు, స్థానిక ప్రజా ప్రతినిధుల అతి జోక్యంతో ట్రిపుల్ ఐటీలో పాలనాపరమైన లోపాలు ఏర్పడ్డాయి. ఎవరికి అనుకూలంగా వారికి అధికారులు వ్యవహరించడంతో విద్యార్థు లకు అన్యాయం జరుగుతోంది. అటు విద్యాపరంగా, ఇటు ఆరోగ్యపరంగా వారు స్థానిక అధికారుల నిర్లక్ష్యానికి బలవుతున్నారు. మెస్‌ల్లో భోజనం రుచీ పచీ లేకుండా, ఉడికీ ఉడకని పదార్థాలు అందిస్తున్నారని క్యాంపస్ అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదు. పేరుకు మెస్ కమిటీలు (విద్యార్థులు, ఉపా ధ్యాయులతో కలిపి) ఉన్నాయి. భోజన సదుపాయాలు సరిగా లేవని వారు నివేదికలు ఇచ్చినా సంస్థ ఉన్నతాధికారుల్లో చలనం లేదు. టెండర్ల ద్వారా మెస్‌ల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తారు. పలుమార్లు ఫిర్యాదు అందినా ఎలాంటి చర్యలు లేకపోవడంతో అధికారులు, మెస్ నిర్వాహకుల బంధంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. క్యాంపస్‌లో ఆరు భోజనశాలలు వున్నా మూడు టెండర్లు మాత్రమే ఆమోదించారు. ఒకేవ్యక్తి రెండు పేర్లతో విడివిడిగా టెండర్లు పొంది రెండింటిని ఒకరే నిర్వహిస్తున్నారు.

విద్యార్థుల జేబులు ఖాళీ

ఇక్కడ విద్యార్థులు ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతానికి చెందిన సామాన్య కుటుంబాల వారే. తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీతో క్యాంపస్‌లో అధిక ధరలు వెచ్చించి ఆహార పదార్థాలు కొనాల్సి వస్తోంది. మెస్‌లలో భోజనం, అల్పాహారం సరిగా లేకపోవడంతో క్యాంపస్‌లో వున్న ఫుడ్ కోర్టును విద్యార్థులు ఆశ్రయిస్తున్నారు. ఈ ఫుడ్ కోర్టులో టెండర్ ద్వారా తెలిపిన ధరలకన్నా ఎక్కువ మొత్తాన్ని విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నారు. స్టాల్స్‌లో సబ్బు లు, దువ్వెనలు మార్కెట్‌కన్నా అధిక ధరలు చెల్లించాల్సిందే.

సెక్యూరిటీ లోపాలు

క్యాంపస్‌లో సెక్యూరిటీ నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రతి నెలా లక్షలాది రూపాయలను ఖర్చు చేస్తోంది. ఇటీవల అధ్యాపకుల క్వార్టర్స్‌లో దొంగతనాలు జరగడం, సెక్యూరిటీ డొల్లతనాన్ని ఎత్తి చూపుతోంది. యథేచ్ఛగా క్యాంపస్‌లోకి ఇతరులు వచ్చిపోతున్నా సెక్యూరిటీ పట్టించుకోవడం లేదు. దీనిపై క్యాంపస్ డైరెక్టర్ స్పందించడం లేదు. కొందరు అధ్యాపకులు నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళ విద్యార్థులను బయటకు తీసుకువెళ్లడంపై విచారణ జరిగినా ఎలాంటి చర్యలు లేవు. ప్రతిరోజూ కనీసం 250 నుంచి 300 వరకు బిర్యానీ ప్యాకెట్లు బయట నుంచి క్యాంపస్‌లకు వస్తాయి. సిగరెట్లు సైతం లభ్యమవుతాయి. అనేకసార్లు బీరు, మద్యం బాటిళ్లు దొరికాయి. ఇక కుక్కలు, కోతులు సంచారం మామూలే. వీటిని ఎవరూ పట్టించుకోవడం లేదు.

మెడికల్ క్యాంప్ ఎందుకు పెట్టడం లేదు

క్యాంపస్‌లో ఎనిమిది వేల మంది విద్యార్థులు, రెండు వేల మంది ఉద్యోగులు ఉంటారు. క్యాంపస్‌లో విష జ్వరాల బారిన పడిన విద్యార్థుల సంఖ్య భారీగానే వున్నా ప్రభుత్వ వైద్యాధికారులు, డీఎంహెచ్‌వో ఈ క్యాంపస్‌ను సందర్శించి పరిస్థితిని విచారించి వెళ్లారు. జ్వర పీడితుల సంఖ్య పట్ల జరుగుతున్న ప్రచారంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. తమ పిల్లలకు ఫోన్‌లు చేసి ఆరా తీస్తూ ఇంటికి వచ్చేయమని చెబుతున్నారు. ప్రభుత్వం ఈ క్యాంపస్‌లో ప్రతి హాస్టల్‌ను తనిఖీ చేసి ఎందరు జ్వరాల బారిన పడ్డారో తేల్చవచ్చు. అధిక సంఖ్యలో జ్వర పీడితులు, రోగపీడితులు ఉంటే ప్రభుత్వమే ఈ క్యాంపస్‌లో మెడికల్ క్యాంపు నిర్వహించాలని కోరుతున్నారు.



అనూహ్యం..


మెస్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న జేసీ ధాత్రిరెడ్డి, అధికారులు

- మంత్రి లోకేశ్‌కు విద్యార్థుల ఫిర్యాదు
- విచారణకు ఆదేశం.. క్యాంపస్‌కు అధికారుల బృందం
- వారు రాకుండానే సెలవుపై ట్రిపుల్ ఐటీ డెరెక్టర్
- రేషన్ బియ్యంతో వంటలపై కేసు నమోదుకు జేసీ ఆదేశం
- మంత్రి ఉండగానే బాలికల హాస్టల్స్‌కు తాళాలపై మండిపాటు


సమస్యలపై ట్రిపుల్ ఐటీ ఉన్నతాధికారులతో చర్చిస్తున్న జేసీ

నూజివీడు/నూజివీడు టౌన్, ఆగస్టు 30: నూజివీడు ట్రిపుల్ ఐటీలో శుక్రవారం అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. వారం రోజులుగా క్యాంపస్‌లో కలుషిత ఆహారం కారణంగా వందలాది మంది విద్యార్థులు అనారోగ్యం పాలయ్యారు. దీనిపై గడిచిన మూడు రోజులుగా వీరికి పెడుతున్న ఆహారంలో ఏ విధమైన మార్పు రాలేదు. మంత్రి పార్థసారథి రెండు రోజుల క్రితం క్యాంపస్‌ను సందర్శించి నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించినా ఇంత వరకు ఆ ఆదేశాలు అమలు కాలేదు. నేటికీ నాణ్యత కొరవడిన భోజనమే విద్యార్థులకు అందుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం విద్యార్థులు తమ ఇబ్బందులపై రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు నాలుగు పేజీల లేఖను మెయిల్ ద్వారా పంపారు. వెంటనే స్పందించిన ఆయన ట్రిపుల్ ఐటీ చాన్సలర్ విజయ్‌కుమార్, జేసీ ధాత్రిరెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ రామ్మోహన్‌రావులను క్యాంపస్‌లో విచారించి నివేదిక ఆదేశించారు. ఇంతలోనే హఠాత్తుగా క్యాంపస్ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్‌రెడ్డి సెలవుపై వెళ్లిపోయారు. ఇక్కడి పరిస్థితులను చక్కదిద్దాల్సిన సంస్థ ఉన్నతాధికారి హఠాత్తుగా సెలవుపై వెళ్ళటం చర్చనీయాంశ మైంది. ఉన్నతాధికారులు వస్తున్నారని సెలవుపై వెళ్లారా ? ప్రభుత్వమే ఆయనను సెలవుపై వెళ్ళమని చెప్పిందా ? స్పష్టత రావాల్సి ఉంది. సాయంత్రం నాలుగు గంటలకు అధికారుల బృందం క్యాంపస్‌కు వచ్చి విచారణ చేపట్టింది. నాసిరకం భోజనం, అల్పాహారాలపై విద్యార్థులు ఫిర్యాదులు చేస్తున్నా కాంట్రాక్టర్‌ను ఎందుకు మార్చలేదని ట్రిపుల్ ఐటీ అధికారులను ప్రశ్నించగా వారు సమాధానం చెప్పలేక నీళ్ల నమిలారు. స్టోర్ రూమ్‌ల్లో కుళ్లిన కూరగాయలతోపాటు రేషన్ బియ్యం దొరకడంతో అవాక్కయ్యారు.

ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయాలని పీడీఎస్ డీటీ వెంకటేశ్వరరావును జేసీ ఆదేశించారు. అధికారులు విద్యార్థులతో సమావేశమ య్యారు. ఫుడ్‌కోర్టును త్వరలోనే మారుస్తామని, ఈలోపు మీకు కావాల్సిన ఆహార పదార్థాలను స్విగ్గి, జొమాటోల ద్వారా తెప్పించుకోవచ్చన్నారు. సత్వరం పరిష్కరించేవి కొన్ని, విధాన నిర్ణయాలు తీసుకోవాల్సిన అంశాలను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చామని తెలిపారు. మెస్‌లు ఆధునికీ కరణ చేయాలని సూచించామన్నారు. ప్రతి నెల ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ట్రిపుల్ ఐటీలో తనిఖీలు నిర్వహించి, ఆహార నాణ్యతపై చర్యలు చేపడతారన్నారు.

మంత్రి ఉండగానే బాలికల హాస్టళ్లకు తాళాలు

మంత్రి పార్థసారథి క్యాంపస్‌ను సందర్శించి రోజు బాలికలు ఆయనను కలవనీయకుండా అధికారులు హాస్టళ్లకు తాళాలు వేశారు. బుధవారం రాత్రి విద్యార్థులతో మంత్రి సమావేశమైనప్పుడు ఒక్క బాలిక కూడా అక్కడ లేరు. తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లకుండా తమను హాస్టళ్లలో బంధించి తాళాలు వేసిన వైనంపై శుక్రవారం ఉదయం క్యాంపస్‌లో బాలికలు నిరసన వ్యక్తం చేశారు. మంత్రి క్యాంపస్‌లో ఉండగానే అధికారులు ఇలా భయం లేకుండా వ్యవహరించడంపై జేసీ ధాత్రిరెడ్డి వారిని ప్రశ్నించారు.

నేడే పింఛన్ల పంపిణీ

- సెప్టెంబరు 1 ఆదివారం కావడంతో ముందస్తుగానే ఏర్పాట్లు
- 2,65,992 మందికి రూ. 113.67 కోట్లు అందజేత

ఏలూరు సిటీ, ఆగస్టు 30 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లలో భాగంగా సెప్టెంబరుకు సంబంధించిన పింఛన్లను జిల్లాలో ఆగస్టు 31వ తేదీ శనివారమే పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఎందుకంటే సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం రావడంతో ఈసారి ఒకరోజు ముందుగానే పంపిణీ చేయాలని నిర్ణయించారు. జిల్లాలో పెన్షన్‌దారులు 2,65,992 మంది ఉండగా వీరికి రూ.113.67 కోట్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. సచివాలయ ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు ఆగస్టు 31వ తేదీ ఉదయం 6గంటలకే పింఛన్లు పంపిణీ ప్రారంభిస్తారు. ఒకవేళ శనివారం పింఛన్ తీసుకోని వారికి సెప్టెంబరు 2న అందించనున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా శనివారం ఉదయం ఆరుగంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయాలన్నారు.


సిబ్బంది సమస్యలను పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్

సిబ్బంది సంక్షేమానికి పెద్ద పీట : ఎస్పీ

ఏలూరు క్రైం, ఆగస్టు 30 : విధి నిర్వహణలో నిమగ్నమైన పోలీసు సిబ్బంది సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నామని వారి సమస్యలను సత్వర పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ సిబ్బంది సంక్షేమ దివస్ కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సిబ్బంది నుంచి సమస్యలతో కూడిన వినతులను స్వీకరించి సత్వరమే పరిష్కరి స్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా పోలీస్ సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు.

రేపు ఏకీకృత పెన్షన్‌కు వ్యతిరేకంగా నిరసన

ఏలూరు అర్బన్, ఆగస్టు 30 : ఇటీవల కేంద్రప్రభుత్వం అమలు తలపెట్టిన ఏకీకృత పెన్షన్ పథకాన్ని వ్యతిరేకిస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న జిల్లాలోని అన్ని తాలూకా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ఆ సంఘ జిల్లా నాయకులు రామారావు, రెడ్డిదొర ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిపాదిత పథకాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు.


బత్తులవారిగూడెంలో మొక్క నాటుతున్న మంత్రి కొలుసు పార్థసారథి, కలెక్టర్ వెట్రిసెల్వి, తదితరులు


ఏలూరులోని జడ్పీ ప్రాంగణం వద్ద మొక్క నాటుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు,ఎమ్మెల్యేలు, కలెక్టర్ తదితరులు

వనం.. మనం

- వాన తుంపర్ల నడుమ పెద్ద ఎత్తున మొక్కలు నాటారు
- జిల్లా వ్యాప్తంగా ఒక్కరోజే లక్షా 42 వేల మొక్కలు
- మంత్రులు కొలుసు, నిమ్మల, కలెక్టర్‌తో సహా పలువురు ఎమ్మెల్యేలు హాజరు
- అన్ని ప్రాంతాల్లోనూ ప్రజాచైతన్యం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పట్టణాలు, నగరాల్లో వనాలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, ప్రతీ ఒక్కరూ దీనిలో భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇంతకుముందే రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. వన మహోత్సవం ప్రతీ ఒక్కరి బాధ్యతని, తదనుగుణంగానే ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటడంలో భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం విజ్ఞప్తి చేశారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వన మహోత్సవం నిర్వహించి రికార్డు స్థాయిలో మొక్కలు నాటారు. పల్లె, పట్నం తేడా లేకుండా ఒకవైపు చిరు జల్లులు పడుతుండగానే వేలాది మంది మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది పొడవునా పది లక్షలకు పైగా మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. అయితే శుక్రవారం ఒక్క రోజులోనే జిల్లా వ్యాప్తంగా లక్షా 42,890 మొక్కలు నాటి అరుదైన రికార్డును నమోదు చేశారు. పచ్చదనం వెల్లివిరిసేలా ఎక్కడికక్కడ మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు సమన్వయం చేసుకుని శుక్రవారం ఉదయం నుంచే అన్నిచోట్ల మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనడమే కాకుండా పర్యవేక్షించారు. నూజివీడు నియోజకవర్గంలోని బత్తులవారిగూడెం సమీపాన నగర వనంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి లాంఛనంగా ప్రారంభించారు. మెట్ట ప్రాంతమైన ఈ భూభాగంలో ప్రతీ ఒక్కరూ తల్లిదండ్రుల పక్కాన రెండేసి మొక్కలు నాటితే ఇక పచ్చదనానికి తిరుగుండదని, ఈ కార్యక్రమంలో భాగం పంచుకోవడం, బాధ్యత తీసుకోవడం ఒక పవిత్ర కార్యక్రమంగా భావించాలని మంత్రి ప్రజలకు పిలుపు నిచ్చారు. జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతుందని, ఎవరంతట వారు స్వచ్ఛందంగా రెండు మొక్కలను నాటాలని కలెక్టర్ వెట్రిసెల్వి కోరారు. నూజివీడు కార్యక్రమంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కూడా పాలుపంచుకున్నారు.

ఏలూరు నగరంలోని జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి నిమ్మల రామానాయుడు మొక్కలు నాటారు. మొక్క పెంచడమనేది పిల్లల పెంపకం మాదిరిగానే బాధ్యతతో కూడినదని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. ఇక మొక్కల పెంపకం తమ బాధ్యతగా ప్రతీ ఒక్కరూ భావించాలని ఇదే కార్య క్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, మద్దిపాటి వెంకట్రాజు, సొంగా రోషన్‌కుమార్, చిర్రి బాలరాజు, బడేటి రాధాకృష్ణయ్య, ముప్పిడి వెంకటేశ్వరరావు, చింతమనేని ప్రభాకర్ తదితరులు ప్రజలకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొక్కల పెంపకానికి, అడవుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, గత ప్రభుత్వ హయాంలో పెద్ద పెద్ద వృక్షాలను నరికి నేలకూల్చారని, ఈ కారణంగా పర్యావరణ పరిరక్షణకు విఘాతం ఏర్పడిందని ఎమ్మె ల్యేలు దుయ్యబట్టారు. ఏలూరు నగరంలో జేసీ ధాత్రి రెడ్డి వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు.

జిల్లాలో ఆల్‌టైం రికార్డ్

జిల్లా వ్యాప్తంగా వన మహోత్సవానికి విశేష ఆదరణ లభించింది. శుక్రవారం ఒక్క రోజే లక్ష్యానికి మించి లక్షా 42 వేల 890 మొక్కలు నాటి సరికొత్త రికార్డు సృష్టించారు. ఏలూరు డివిజన్ పరిధిలో 251 గ్రామ పంచాయతీల్లో 43,490 మొక్కలు, జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని 167 పంచాయతీల్లో 33 వేల మొక్కలు, నూజివీడు డివిజన్‌లో 129 పంచాయతీల్లో 66,400లకు పైగా మొక్కలు నాటారు. నూజివీడు, కైకలూరు, ముదినేపల్లి, పెదవేగి, ఉంగుటూరు, ద్వారకా తిరుమల, ఆగిరిపల్లి మండలాల్లో ఒక్కో మండలంలో ఐదువేలకు పైబడి మొక్కలు నాటడం విశేషం. తొలిరోజు ఆరు వేల మొక్కలు నాటడం ద్వారా పెదవేగి మండలం తొలి వరుసలో నిలవగా అత్యల్పంగా వేలేరుపాడు మండలంలో 1,800 మొక్కలే నాటారు. వన మహోత్సవంలో ఎక్కువ మొక్కలు నాటి ప్రజలు చైతన్యవంతంగా వ్యవహరించారని, ఇది శుభపరిణామమని, ప్రజల భాగస్వామ్యం ఉంటే ఏ కార్యక్రమమైనా విజయవంతం అవుతుందనడానికి వన మహో త్సవమే ఉదాహరణ అని కలెక్టర్ వెట్రిసెల్వి పేర్కొన్నారు. ఒకే రోజు పెద్ద సంఖ్యలో మొక్కలు నాటేందుకు వీలుగా ఆయా ప్రాంతాల అధికారులను, ప్రజలను సమన్వయపరిచే దిశగా నోడల్ అధికారిగా డీపీవో శ్రీనివాస్ వ్యవహరించారు.

ముసురు

- అల్పపీడన ద్రోణి కారణంగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు
- ముదినేపల్లి మండలంలో 45.2 మి.మీ వర్షపాతం నమోదు

ఏలూరు సిటీ/ నూజివీడు టౌన్ ఆగస్టు 30 : మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఎడతెరపి లేకుండా నానుడు వర్షాలు కురుస్తు న్నాయి. ఈ అల్పపీడనం పశ్చిమ వాయువ్యంగా పయ నించి ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాకు ఆనుకుని పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించే సమ యంలో మరింత బలపడుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. తర్వాత రెండు రోజుల్లో మరింత బలపడి ఇది వాయుగుండంగా మారే అవకాశాలున్నా యని తెలిపింది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తాలో ముసురు వాతావరణం నెలకొని ఉంటుందని ఎక్కువ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ అల్పపీడన ప్రభావం కారణంగా గడిచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా ముదినేపల్లి మండలంలో 45.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 6.7 మి.మీ నమోదైంది. నూజివీడు డివిజన్ వ్యాప్తంగా శుక్రవారం 50.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆగిరిపల్లిలో 30.8 మి.మీ, మండవల్లి 23.6, నూజివీడు 18.4, వేలేరుపాడు 15, కుక్కునూరు 10, జంగారెడ్డిగూడెం 8.6, పెదపాడు 5.2, తాడేపల్లిగూడెంలో 2.8, పెంటపాడు 3.6, తణుకు 5.8, అత్తిలి 5.2, గణపవరం 3.6, ఆకివీడు 1.4, ఉండి 4.4, పాలకోడేరు 3.4, మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి. ఈ వర్షాలతో సార్వా సాగులో వరితో పాటు ఇతర పంటల సాగు ఊపందుకుంది.


యలమంచిలి-చించినాడ రహదారిపై నిలిచిన నీరు



వరాలివ్వమ్మా..వరలక్ష్మీ



శ్రావణ మాసం ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ద్వారకా తిరుమల వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సుమారు రెండు వేల మంది మహిళలు ఈ వేడుకలో పాల్గొన్నారు.

-7లో


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆచార్యుడు సందీప్

నిట్‌లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌పై అవగాహన

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 30 : విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచనలు వెలికితీయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఏపీ నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ సందీప్ అన్నారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) విద్యా మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఆచార్యులు శ్రీఫణికృష్ణ కోఆర్డినేటర్‌గా , డాక్టర్ సందీప్, డాక్టర్ శంకర్‌లు మెంటార్‌లుగా వ్యవహించారు. ప్రతీ విద్యార్థి వినూత్న ఆలోచనలు , ప్రాజెక్టులతో ముందుకు రావాలన్నారు. సెప్టెంబరు 9న నిర్వహించే ఇంటర్నల్ కాంపిటీషన్ కార్యక్రమానికి 30 టీమ్‌లు వరుకూ పాల్గొనే అవకాశాలు న్నాయన్నారు. నవంబరులో కేంద్ర ప్రభుత్వం గ్రాండ్ ఫైనల్ కార్యక్రమాన్ని నిర్వహించి విజేతల వివరాలు ప్రకటిస్తుందన్నారు. ప్రథమస్థానంలో వచ్చినవారికి రూ.లక్ష, రెండో స్థానంలో గెలిచిన వారికి రూ.50 వేలు కేంద్ర ప్రభుత్వం అందించనుందన్నారు.

రేపు నిట్‌లో అంతర్ జిల్లా యోగాసన పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 30: యోగా స్పోర్ట్స్ అసోషియేషన్ ఆఫ్ వెస్ట్ గోదావరి ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న ఏపీ నిట్‌లో ఇంటర్ డిస్ట్రిక్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్ నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు ఇంజమూరి మాధవరావు తెలిపారు. తాడేపల్లిగూడెంలోని యోగా సెంటర్‌లో శుక్రవారం జిల్లా స్థాయి యోగా చాంపియన్ షిప్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ పోటీల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, సీనియర్ ఏ,బీ,సీ కేటగిరిల్లో 10 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల వయసు గల వారు పాల్గొనవచ్చని వివరించారు.



ఫలితాలు విడుదల చేస్తున్న ఉద్యాన వర్సిటీ వీసీ, ఆచార్యులు

విద్యార్థుల జ్ఞానార్జనకు సాంకేతిక శిక్షణ

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 30: విద్యార్థుల జ్ఞానార్జనకు సాంకేతిక శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని ఉద్యాన విశ్వ విద్యాలయ ఉపకులపతి డాక్టర్ గోపాల్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఆవరణలో వర్శిటీ విద్యార్థులకు ఉద్యాన రంగంలో సుస్థిరత కోసం సాంకేతిక ప్రమేయంపై వర్చువల్ శిక్షణా ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యాన విశ్వవిద్యాలయ అధికారులు ఏవీడీ దొరాజీరావు, భరద్వాజ్, రిజిస్ట్రార్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

హార్టీ సెట్ ఫలితాల విడుదల

హార్టికల్చర్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సులో ప్రవేశానికి నిర్వహించిన హార్టీ సెట్ ఫలితాలు శుక్రవారం ఉద్యాన విశ్వ విద్యాలయ ఉప కులపతి డాక్టర్ గోపాల్ విడుదల చేశారు. 266 మంది హార్టీసెట్ పరీక్ష రాయగా 255 మంది ఉత్తీర్ణత సాధించారు. హార్టీసెట్‌లో మొదటి ర్యాంకు అనుమల విజయలక్ష్మి (సత్యసాయి జిల్లా), రెండో ర్యాంకు కుంపాటి పావని (నంద్యాల జిల్లా), మూడో ర్యాంకు గోసాల సతీష్ (ప్రకాశం జిల్లా)లు ప్రతిభ కనబరిచినట్టు వీసీ వెల్లడించారు. రిజిస్ట్రార్ శ్రీనివాసులు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ స్వామి, డీన్ ఆఫ్ హార్టికల్చర్ నాయుడు, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల నుంచి సమగ్రశిక్ష జీసీడీవో తొలగింపు

ఏలూరు అర్బన్, ఆగస్టు 30 : సమగ్రశిక్ష జీసీడీవో సబిహ సుల్తానాను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ ఎస్ఎస్ఏ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉర్దూ ఏఎంవోగా సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టులో ప్రవేశించిన ఆమె తదుపరి కాలంలో జీసీడీవోగా బాధ్యతలు చేపట్టడానికి జిల్లా ప్రాజెక్టు, కలెక్టర్ నుంచి ర్యాటిఫికేషన్, ఆ మేరకు ప్రభుత్వ అనుమతి లేకుండా సెక్టోరల్ అధికారి పోస్టులో గత కొన్నేళ్ళుగా కొనసాగుతుండటాన్ని నిబంధనలకు విరుద్ధంగా పరిగణించిన ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఎస్ఎస్ఏ జిల్లా కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. పోస్టుమారిన విషయమై సకాలంలో ర్యాటిఫికేషన్‌ను జిల్లాప్రాజెక్టు అధికారులు పంపకపోవడం వల్లే ఈ తొలగింపు జరిగిందేతప్ప ఇందులో ఆమె తప్పులేదని సమాచారం. శనివారం జీసీడీవో బాధ్యతల నుంచి రిలీవ్ చేసిన అనంతరం అప్పనవీడు స్కూలుకు టీచరుగా నియమించే అవకాశాలున్నట్టు కార్యాలయ వర్గాలు వివరించాయి. కాగా కొత్తగా జీసీడీవో వేకెన్సీని భర్తీ చేసేందుకు రెండు రోజుల్లో నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ పోస్టుకోసం మునునూరు ఎంపీయూపీ స్కూలులో పనిచేస్తున్న ఓ టీచరు దరఖాస్తు చేసుకోగా తుది నియామకం ఈమెకే ఖరారయ్యే చాన్స్ ఉన్నట్టు సమాచారం.

టీచర్స్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఎస్టీయూ కార్యాచరణ

ఏలూరు అర్బన్, ఆగస్టు 30 : ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో నిర్వహించనున్న ఉప ఎన్నికలకు జిల్లాలో అర్హతలు గల ఉపాధ్యాయులు, అధ్యాపకులతో త్వరితగతిన ఓటు నమోదు చేయించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయు) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ సంఘ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏలూరులోని సంఘజిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళుగా ప్రభుత్వ విద్యారంగంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి త్వరలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమ సంఘాల అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారానే టీచర్ల హక్కులను పరిరక్షించుకోగలమన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ శనివారం నుంచి జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను సందర్శించి ఓటరు నమోదు పత్రాలను పంపిణీ చేయాలని సూచించారు. సంఘ సీనియర్ నాయకులు ప్రసాదరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, రవిచంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



72 గంటల ప్రసారంలో పాల్గొన్న విద్యార్థులు

గిన్నిస్ రికార్డులోకి ‘ విష్ణు 90.4 రేడియో’

భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 30: భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన కమ్యూనిటీ రేడియో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. విద్యా సంస్థల్లోని 100 మంది విద్యార్థులు నిరంతర రేడియో ప్రసారాన్ని నిర్వహించి రికార్డు నెలకొల్పారు. విష్ణు 90.4 కమ్యూనిటీ రేడియోలో 2022 డిసెంబరు 7,8,9 తేదీల్లో 72 గంటల 30 నిమిషాల 30 సెకన్లు నిరంతరాయంగా 100 మంది విద్యార్థులు ప్రసారాలు నిర్వహించారు. హాస్టల్ జీవితం, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆహారం, వ్యవసాయం, ఆరోగ్యం, పర్యావరణం ఇలా వివిధ రంగాల్లో అంశాలపై విద్యార్థులు రేడియోలో లైవ్ ప్రసారం చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో కార్య క్రమం జరిగింది. అనంతరం విష్ణు కళాశాల యాజమాన్యం ఆ ప్రసారాన్ని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కార్యాలయానికి పంపింది. దానిపై 140 పర్యాయాలు గిన్నిస్ బుక్ ప్రతినిధులు చర్చల అనంతరం నిర్ధారణ చేసిన తర్వాత గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును ప్రకటించింది. సర్టిఫికెట్‌ను విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ విష్ణురాజు శుక్రవారం ఆవిష్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు..పక్కన మంత్రి దుర్గేష్, జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, జేసీ తదితరులు

హాట్..హాట్‌గా

జడ్పీ సర్వసభ్య సమావేశం

జడ్పీ చైర్‌పర్సన్‌పై ఎమ్మెల్యే చింతమనేని ఆగ్రహం

జిల్లా అభివృద్ధే లక్ష్యంగా కలిసి పనిచేద్దాం : మంత్రి నిమ్మల

ప్రజలకు చేరువుగా మెరుగైన పాలన : మంత్రి దుర్గేష్

ఏలూరుసిటీ, ఆగస్టు 30: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలిసారిగా శుక్రవారం జరిగిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం హాట్‌హాట్‌గా జరిగింది. ఎమ్మెల్యేలు వివిధ సమస్యలను ప్రస్తావించే సమయంలో జడ్పీ చైర్‌పర్సన్‌కు దెందులూరు ఎమ్మెల్యేకు మధ్య వాగ్వివాదం జరిగింది. మంత్రి నిమ్మల రామానాయుడు జోక్యంతో ఆ వివాదం సద్దుమణిగింది. దెందులూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఎక్స్‌రే మిషన్ కొనుగోలు చేశారని, ప్రస్తుతం ఆ మిషన్ అక్కడ లేదని, ఆ మిషన్‌ను ఎవరు ఎక్కడికి తరలించారో చెప్పాలని ఆరోగ్యశాఖ అధికారులను ఎమ్మెల్యే చింతమనేని నిలదీశారు. జడ్పీ చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని సబ్జెక్ట్ మాత్రమే మాట్లాడాలని అనడంతో చింతమనేని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు చెప్పుకోవటానికి ఇదొక వేదికని మమ్మల్ని మాట్లాడవద్దనడం ఏమిటని ప్రశ్నించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరపాల్సిన సమావేశాన్ని మొక్కుబడిగా ఒక పూటలో పూర్తి చేయాలనుకోవటం ఏమిటని నిలదీశారు. జడ్పీటీసీలు, ఎంపీపీలు మాట్లాడేందుకు సమయం లేకుండా పోతోందని, పూర్తి స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అధికారులు, ఎమ్మెల్యేలతో కలిపి సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు చర్చించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అధ్యక్షత వహించిన జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ స్థానిక సంస్థల బలోపేతానికి 15వ ఆర్థిక సంఘ నిధులను గ్రామ, మండల, జిల్లా పరిషత్‌లకు విడుదల చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పార్టీలకు అతీతంగా అందరం కలిసి పని చేద్దామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.జడ్పీ సమావేశాలు ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా ఉండాలని సీఎం చంద్రబాబునాయుడు జడ్పీ సమావేశాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చేవారన్నారు. గత ఐదేళ్లలో జడ్పీ సమావేశాలు కేవలం మొక్కుబడిగా జరిగాయే తప్ప సమస్యల పరి ష్కారంలో చర్యలు తీసుకోలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో పంట అమ్మిన రైతులకు 1600 కోట్లు రూపాయలు బకాయిలు పడితే తమ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ బకాయిలు చెల్లించామన్నారు. పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినందు వల్ల ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని చంద్రబాబు ప్రధాన మంత్రిని, ఆర్థిక శాఖామంత్రిని కలిసి రూ.12,157 కోట్లు పోలవరం ప్రాజెక్టుకు మంజూరు చేయించారన్నారు. రైతుల అభిప్రాయాల మేరకు రాబోయే రోజుల్లో నీటి సంఘాల ఎన్నికలు ఏర్పాటు చేసి సంఘాలకు కాల్వల బాధ్యతలను అప్పగిస్తామన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లు మరమ్మతులు, పునఃనిర్మాణాలకు 128 రోడ్లను గుర్తించామన్నారు. గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటు న్నామన్నారు.

రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక వ్యవహారాల శాఖామంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ప్రజలకు చేరువుగా,ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మెరుగైన పాలన అందిస్తామని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో కుంటుపడిన నీటిపారుదల, వ్యవసాయం, విద్యా, వైద్యం, ఇళ్ళ నిర్మాణాల ప్రగతిని తిరిగి పట్టాలెక్కించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెంపుదల చేసిన పెన్షన్‌లు పంపిణీ చేశామని , అదే విధంగా ఈ రోజు వనమహోత్సవాన్ని అద్భుతమైన కార్యక్రమంగా నిర్వహించుకుంటు న్నామన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

స్థాయీ సంఘాల ఏర్పాటు

సమావేశంలో జిల్లా ప్రజా పరిషత్ 1 నుంచి 7వ స్థాయి సంఘం వరకు ఉన్న కమిటీలను ఏర్పాటు చేశారు. నూతనంగా ఎన్నికైన గౌరవ సభ్యుల పేర్లను ఆమోదించారు

1వ స్థాయి సంఘం కమిటీ (ప్రణాళిక, ఆర్థిక స్థాయి) : ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్‌కుమార్ , ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్.

2.గ్రామీణాభివృద్ధి కమిటీ : నరసాపురం పార్లమెంట్ సభ్యులు భూపతి రాజు శ్రీనివాసవర్మ, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు.

3.వ్యవసాయ కమిటీ: నిడదవోలు ఎమ్మెల్యే కందుల దుర్గేష్, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు.

4.విద్య, వైద్యసేవలు : భీమవరం ఎమ్మెల్యే రామాంజనేయులు.

5. మహిళా సంక్షేమ కమిటీ: కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

6. సాంఘిక సంక్షేమ కమిటీ: తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్.

7వ స్థాయి సంఘం (పనుల స్థాయి కమిటీ): రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు.

తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ భారీ వర్షాలు , వరదల వల్ల జూలై నెలలో రైతాంగం నష్టపోయారని దీనికి సంబంధించిన పంట కాల్వల్లో పూడికతీత, గుర్రపుడెక్క తీయించి పంటను కాపాడాలన్నారు. ధాన్యం సేకరణ విషయంలో గత ప్రభుత్వం చిరిగిన గోనె సంచులు అందించటం వల్ల రైతులు నష్టపోయారన్నారు.

కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా గోదావరి వాటర్‌ను ఇంటింటికీ ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొవ్వూరులో పక్కనే గోదావరి నది ఉన్నప్పటికీ బోరునీటికే పరిమితమయ్యారని మూడు మండలాల్లో జల్‌జీవన్ మిషన్ ద్వారా గోదావరి మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం, చింతలపూడి, ఆస్పత్రులలో కనీస సౌకర్యాలు లేవని వీటిపై శ్రద్ధ వహించి తక్షణమే సౌకర్యాల కల్పనకు కృషి చేయాలన్నారు.

ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో నూతన ఎక్స్‌రే యూనిట్‌ను ఏర్పాటు చేయాలని, కొవ్వలి కొత్తపేటలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయని దీనిని అరికట్టటానికి చర్యలు తీసుకోవాలన్నారు, కొన్నిచోట్ల స్కూళ్ళలో నీరు నిల్వ ఉండి విద్యార్థులు నడిచే పరిస్థితి లేకుండా ఉందని దీనిపై యాక్షన్‌ప్లాన్ తయారు చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), పత్సమట్ల ధర్మరాజు, మద్దిపాటి వెంకట్రాజు, చిర్రి బాలరాజు, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డీఎఫ్‌వో రవీంద్రధామ, జడ్పీ సీఈవో సుబ్బారావు పాల్గొన్నారు. జడ్పీ సమావేశం అనంతరం వ్యవసాయ విస్తరణ కార్యక్రమం పొలం పిలుస్తోంది పోస్టర్‌ను రాష్ట్ర మంత్రులు నిమ్మల , కందుల దుర్గేష్‌లు ఆవిష్కరించారు.


హాజరైన ఎమ్మెల్యేలు ముప్పిడి, బడేటి చంటి, ధర్మరాజు, ఆరిమిల్లి , రోషన్ కుమార్, మద్దిపాటి, చింతమనేని, స్థానిక ప్రజాప్రతినిధులు

బ్రాహ్మణ చెరువులో ఎలక్ట్రిక్ కారు దగ్ధం

ప్రమాదం నుంచి బయట పడ్డ పెనుమంట్ర ఎంపీపీ



పెనుమంట్ర, ఆగస్టు 30 : పెనుమంట్ర మండలం బ్రాహ్మణ చెరువు పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఎలక్ట్రికల్ కారు నుంచి మంటల వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం పెనుమంట్ర మండల ఎంపీపీ కర్రి వెంకట నారాయణ రెడ్డి (వాసు రెడ్డి)పాలకొల్లు నుంచి ఎస్ ఇల్లింద్రపర్రు ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో తన కారులో మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన ఎంపీపీ వాసు రెడ్డి కారు దిగి ప్రమాదం నుంచి బయటపడ్డారు. కారు పూర్తిగా కాలి దగ్ధమైంది. మంటలు వ్యాపించడానికి కారణం బ్యాటరీ, లేక షార్ట్ సర్క్యూటా అన్నది తెలియాల్సి ఉంది. పెనుమంట్ర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ మద్దాలకు గిడుగు జాతీయ సాహితీ పురస్కారం



ద్వారకాతిరుమల, ఆగస్టు 30: పుస్తకాలే సమాజాన్ని ప్రభావితం చేస్తాయని ఎన్టీఆర్ లిటరేచర్, వెబ్‌సైట్ కమిటీ చైర్మన్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు జనార్దన్ అన్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్, శంకరం వేదికల నేతృత్వంలో విజయవాడలో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పంగిడిగూడెం జడ్పీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా చేస్తున్న డాక్టర్ మద్దాల పెద్దిరాజుకు గిడుగు జాతీయ సాహితీ పురస్కారం అందజేశారు. ఆయన రచించిన స్మైల్ రచనలు-అనుశీలన అనే పరిశోధనా పుస్తకానికి ఈ పురస్కారం అందించారు. గిడుగు వారి ముని మనవ రాలు గిడుగు కాంతి కృష్ణ, టీడీ జనార్దన్, నవ్యాంధ్ర రచయితల సంఘ అధ్యక్షుడు బిక్కి కృష్ణ, కంఠంనేని రవిశంకర్, డాక్టర్ విద్యాధర్, కె.శ్రీనివాస్‌గౌడ్, కలిమిశ్రీ ఈ పురస్కారాన్ని అందించినట్లు పెద్దిరాజు తెలిపారు. హెచ్‌ఎం సురేష్, ఎంఈవోలు సుబ్బారావు, వెంకట్రావు ఉపాధ్యాయులు అభినందించారు.

క్రైం కార్నర్

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

యువకుడు మృతి..ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువతి


చికిత్స పొందుతున్న యువతి..


మృతి చెందిన రాజేష్

పాలకొల్లు రూరల్, ఆగస్టు 30 : ప్రేమ జంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా యువకుడు మరణించగా, యువతి తీవ్ర గాయాలతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. భీమవరం రైల్వే ఎస్ఐ రమణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం పాలకొల్లు పట్టణ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాల వద్ద యువకుడు మృతి చెంది ఉండగా యువతి తీవ్ర గాయాలతో కనిపించడంతో స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గణపవరం మండలం ఎస్.కొండేపాడుకు చెందిన వెన్నెల రాజేష్ (20), భీమవరం శివారు దుర్గాపురానికి చెందిన ఒక యువతి కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. పెళ్ళికి పెద్దలు అంగీక రించకపోవడంతో గురువారం రాత్రి బైక్‌పై భీమవరం నుంచి పాలకొల్లుకు చేరుకుని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించినట్టు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువతి తెలిపింది. ఇద్దరూ పట్టాలపైకి చేరుకున్నామని రైలు దగ్గరకు రాగానే తనను పక్కకు నెట్టివేశాడని కొద్దిసేపటి తరువాత తనకు స్పృహ వచ్చిందని యువతి తెలిపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. తమ కుమార్తె తప్పి పోయిందదని యువతి తల్లిదండ్రులు భీమవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. రాజేష్‌కు గతంలో పెళ్ళి జరిగి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నట్టు సమాచారం.

స్థలవివాదం..హత్య కేసులో ఐదుగురి అరెస్టు

భీమడోలు, ఆగస్టు 30 :భీమడోలు మండలం అర్జావారిగూడెం ప్రాంతంలో ఆస్తి తగాదాల నేపథ్యంలో వ్యక్తిపై కత్తితో దాడిచేసి మహిళను గాయపర్చిన కేసులో ఐదుగురుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భీమడోలు సీఐ రవికుమార్ తెలిపారు. ఈనెల 28వ తేదీన అర్జావారిగూడెంలో ఆస్తి తగాదాల నేపథ్యంలో కన్నకూతురు రాజారాణిపై దాడి చేసి అడ్డు వచ్చిన చేబత్తిన కృష్ణ మెడపై నరికి అతని మృతికి కారణమైన తడపల దుర్గారావు, తడపల వెంకటేశ్వరరావు, తడపల ప్రశాంత్, తడపల వీరయ్య, తడపల వివేక్‌లను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఏలూరు శౌరిపురంలో చోరీ

ఏలూరు క్రైం, ఆగస్టు 30 : ఇంటికి తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్ళి వచ్చేటప్పటికి దొంగలు ఆ ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఏలూరు సమీపంలోని వట్లూరు పంచాయతీ శౌరిపురంలో నివాసం ఉంటున్న ఆకుకూరి అన్నమ్మ తన కుటుంబ సభ్యులతో ఈనెల 22న బంధువుల ఇంటికి ఊరు వెళ్ళారు. తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బంగారు చైను, చెవిదిద్దులు, మంగళ సూత్రాలు, ఒక రింగుల, మొత్తం మూడు కాసుల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఏలూరు త్రిటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డెంగీతో చిన్నారి మృతి

అత్తిలి, ఆగస్టు 30 : డెంగీతో చిన్నారి మృతి చెందింది.అత్తిలి గ్రామానికి చెందిన గోనా సుబ్బారావు కుమార్తె నిత్యశ్రీ పద్మ (6) అత్తిలి మదర్ మెర్సిల్లా పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. మూడురోజుల క్రితం పాపకు జ్వరం రావడంతో తణుకులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా డెంగీ జ్వరంగా నిర్ధారించి వైద్యం అందించారని, అయితే గురువారం బాలిక పరిస్థితి విషమించడంతో విజయవాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం బాలిక మృతి చెందిందన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేపీఎస్ కిషోర్

వినాయక చవితి విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి : ఎస్పీ

ఏలూరు క్రైం, ఆగస్టు 30 : వినాయక చవితి ఉత్సవాలు ఎదుటి వారికి ఇబ్బందులు కలుగకుండా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ప్రజలకు సూచించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ పెద్ద శబ్దాలతో లౌడ్ స్పీకర్లను వినియోగించకూడదన్నారు. వినాయక ఉత్సవ కమిటీ వారు ముందుగానే పోలీసు అనుమతి తీసుకోవాలని హెచ్‌టిటిపిఎస్//గణేష్‌ఉత్సవ్.నెట్‌కు కాని, లేదా వాట్సాప్ ఫోన్ నెంబర్ 79950 95800కు హాయ్ అని టైప్ చేసిన తరువాత ఒక లింక్ వస్తుందని ఆ లింక్‌పై క్లిక్ చేస్తే ఓటీపీ వస్తుందన్నారు. ఆ తరువాత అప్లికేషన్ కోసం గూగుల్ ఫారమ్ ఓపెన్ చేసి అందులో ఉన్న కాలమ్స్ పూర్తిచేసి సబ్‌మిట్ చేయాలన్నారు. అనంతరం పోలీసులు విచారణ జరిపి సింగిల్ విండో పద్ధతి ద్వారా పర్మిషన్ మంజూరవుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్టు 30 అమలులో ఉందని, ఎవరైనా ఉల్లంఘిస్తే సెక్షన్ 32 పోలీస్ యాక్టు ప్రకారం కాని లేదా బీఎన్ఎస్ సెక్షన్ 223 ప్రకారం ఆరు నెలల శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా లేదా రెండూ విధించబడతాయన్నారు. నిర్వాహకులు ముందుగా పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. రోడ్డుకు అంతరాయం లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. శబ్ద కాలుష్యం ఉపయోగించకూడదని ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ మాత్రమే లౌడ్ స్పీకర్లను వినియోగించుకోవాలన్నారు. రాత్రి వేళ మండపాల వద్ద కమిటీ సభ్యులు కాపలా ఉండాలన్నారు. నిమజ్జనానికి సంబంధించిన రూటు మ్యాప్‌ను ముందే తెలియజేయాలన్నారు. ఊరేగింపుల్లో బాణసంచా ఉపయోగించరాదని, డీజే శబ్దాలు, అస్లీల డాన్సులు నిరోధించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించకూడదన్నారు. పోలీస్ శాఖ సూచనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేసే మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎస్పీతో పాటు ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

జిల్లాలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు


తక్కెళ్లపాడులో పశువులకు టీకాలు వేస్తున్న జేడీ నెహ్రూబాబు

ద్వారకాతిరుమల, ఆగస్టు 30: గాలికుంటు వ్యాధి నుంచి రక్షణకు పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందించేందుకు టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ జేడీ నెహ్రూబాబు అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడులో శుక్రవారం ఆయన 420 పశువులకు టీకాలు వేయించారు. జిల్లాలో ఈ టీకాలతో పాటు 4-6 నెలల వయసున్న పెయ్యి దూడలకు బ్రూసెల్ల వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ బ్రూసెల్ల టీకాలను ఒక్కసారి వేయిస్తే జీవితాంతం పనిచేస్తాయన్నారు. సెప్టెంబరు 18 వరకూ ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. భీమడోలు ఏడీ సాయి రమేష్, మండల పశు వైద్యాధికారి అంగర సురేష్ పాల్గొన్నారు.

ఇసుక అమ్మకాలపై ఏసీబీ విచారణ

కుక్కునూరు, ఆగస్టు 30: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుక్కునూరు మండలంలోని ఇసుక రీచ్‌ల ద్వారా జరిగిన ఇసుక అమ్మకాలపై రెండు రోజులుగా ఏసీబీ అధికారులు విచారణ జరుపుతున్నారు. కుక్కునూరు మండలంలోని ఇబ్రహీంపేట, వింజరం, బూరుగువాయి కేంద్రాలుగా ఇసుక అమ్మకాలు జరిగాయి. ఇబ్రహీంపేట ఇసుక రీచ్‌కి అనుమతి ఉన్నప్పటికి అక్కడ ఇసుకను జిల్లాలోని ప్రజల అవసరాలకు మాత్రమే వినియోగించాల్సి ఉంది. అలాగే బూరుగవాయి రీచ్‌కు అనుమతిలేనప్పటికి యథేచ్ఛగా తవ్వారు. తవ్విన ఇసుకను తెలంగాణాకు కూడా అక్రమంగా తరలించినట్లు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. ఇదిలా ఉండగా ఏసీబీ అధికారులు గత ప్రభుత్వ హయాంలో జరిగిన తవ్వకాలపై రెండురోజులుగా కుక్కునూరు మండలంలో విచారణ జరుపుతున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై సూత్రధారులు ఎవరనేది సమాచారం సేకరిస్తున్నారు.


అమ్మవారిని వేదిక వద్దకు తీసుకువస్తున్న దృశ్యం

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 30: చిన్నతిరుమలేశుని దివ్యక్షేత్రంలో సామూ హిక వరలక్ష్మీ వ్రతాల్లో మహిళలు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. శ్రావణమాసం ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని అనివేటి మండపంలో దాదాపు రెండు వేలమంది ఈ వ్రతాల్లో పాల్గొన్నారు. ముందుగా వెండి శేషవాహనంపై వరలక్ష్మీ అమ్మవారిని ఉంచి అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేదమంత్రోచ్చరణల నడుమ అట్టహాసంగా అనివేటి మండప వేదిక వద్దకు తీసుకువచ్చారు. అలంకరించిన వేదికపై అమ్మవారిని ఉంచి హారతులు సమర్పించారు. భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. మహిళలకు పసుపు, కుంకుమ, జాకెట్టు ముక్క, గాజులను పంపిణీ చేశారు.

శాస్త్రోక్తంగా..పవిత్రారోహణ



లక్ష్మీపురం ఆలయంలో జరుగుతున్న దివ్య పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం పవిత్రారోహణ ఆలయంలో శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ యాగశాలలో ఉంచిన పవిత్రాలను శిరస్సులపై ఉంచుకుని అర్చకులు, పండితులు, ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. అనంతరం పవిత్రాలను శ్రీవారి మూలవిరాట్‌పైన, అమ్మవార్లపైన, ఉత్సవమూర్తులపైనా ఆలయంలో కొలువైన సుభద్ర, బలభద్ర. జగన్నాధుల మూలవిరాట్‌లు, ఆళ్వార్‌లపై పవిత్రాలను వేశారు. పవిత్రాంగ హోమం, శాంతి హోమాలను జరిపారు.

కుళాయిల్లో మురుగు నీరు

ఫిర్యాదులు చేస్తున్నా స్పందించని అధికారులు



నరసాపురం, ఆగస్టు 30: నరసాపురంలోని స్టీమర్‌రోడ్, పొన్నపల్లి, మాధవాయిపాలెం ప్రాంతాల్లో ఎనిమిది రోజులుగా కుళాయిల్లో మురికి నీరు వస్తున్నది. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఇదే తంతు. గృహాలకు నీటిని అందించే మెయిన్ పైప్‌లైన్‌లో డ్రైనేజీ నీరు కలవడంతో ఆ నీరంతా కలుషితమై కుళాయిల్లోకి వస్తోంది. దుర్వాసన భరించ లేకపోతున్నారు. పొరపాటున ట్యాంకుల్లోకి నీరు ఎక్కితే చాలు మొత్తం ట్యాంక్ అంతా శుభ్రం చేసుకోవాల్సి వస్తుంది. బోర్ వేసి నీళ్లు పడుతుంటే దుర్వాసన వస్తున్నది. ఈ విషయాన్ని చాలా మంది మునిసిపల్ ఆధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరికొందరు ఆర్డీవో దృష్టిలో కూడా పెట్టారు. అయినా ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదు. దీంతో తాగేందుకు, వంటలు చేసుకునేందుకు ఆర్వో వాటర్ కొనుక్కుంటున్నారు. దీనిపై మాధవాయి పాలెంలో నివాసం ఉంటున్న వ్యాపారి సతీష్ మాట్లాడుతూ పదిరోజుల నుంచి ఇదే పరిస్థితి ఉందని మునిసిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేస్తున్నా స్పందన లేదు. నీటిని బయట నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. కుళాయిల్లో ఇవే నీరు. దీనిపై ఏఈ సునీల్ వివరణ ఇస్తూ మురికినీరు ఎక్కడ కలుస్తుందన్న దానిపై చాలాచోట్ల తవ్వి చెక్ చేస్తున్నాం. రెండ్రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

మిగులు టీచర్లను మండలాల్లోనే సర్దుబాటు చేయాలి


యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

ఏలూరు అర్బన్, ఆగస్టు 30: సర్‌ప్లస్ టీచర్లను ఆన్‌లైన్ కౌన్సెలింగ్ పేరుతో బలవంతంగా సర్దుబాటు బదిలీలు చేయడాన్ని తక్షణమే నిలిపివేయాలని యూటీఎఫ్ జిల్లాశాఖ నేతృత్వంలో డీఈవో కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్‌ముస్తఫా అలీ, రవి కుమార్ మాట్లాడుతూ టీచర్ల సర్దుబాటుపై ఇటీవల ప్రభుత్వం అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఇచ్చిన హామీలను గాలికొదిలేశారని, ఇష్టారాజ్యంగా సర్దుబాట్లు చేస్తున్నారని ఆరోపించారు. హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లు ఉండాలనే సాకుతో ఎస్జీటీలను బలవంతంగా బదిలీలు చేయడం తగదన్నారు. సర్దుబాట్లపై కనీసం డీఈవో, ఆర్జేడీలను కూడా విశ్వసించకుండా కంప్యూటర్ యంత్రాలను నమ్మి టీచర్లను మనోవేదనకు గురిచేస్తున్నారని విమర్శించారు. నిబంధనలకు వ్యతిరేకంగా జరిపిన పని సర్దుబాట్లను సవరించి, మండల స్థాయిలోనే అన్ని కేడర్ల టీచర్లను అడ్జస్ట్‌చేసేలా ఉత్తర్వులు జారీచేయాలని డిమాండ్ చేశారు. డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ అవధానికి వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఏకీకృత పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్‌విధానాన్నే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ నిరసన ప్రదర్శన నిర్వహించారు. డీటీకి వినతిపత్రాన్ని అందజేశారు.

నేడు ఏలూరు డివిజన్ స్కూల్ అసిస్టెంట్ల సర్దుబాట్లు

ఏలూరు అర్బన్, ఆగస్టు 30: ఏలూరు డివిజన్‌కు సంబంధించి సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్ల పని సర్దుబాటు కౌన్సెలింగ్‌ను శనివారం ఎంఈవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. మొత్తం 58 ఖాళీల భర్తీకి డివిజన్ పరిధికి చేర్చిన 97మంది స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులను కౌన్సెలింగ్‌కు పిలుస్తున్నారు. నూజివీడు, జంగారెడ్డిగూడెం డివిజన్ల సర్‌ప్లస్ టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్ పూర్తయిన విషయం తెలిసిందే. స్కూల్ అసిస్టెంట్ కేడర్ సర్దుబాట్లు ముగిసిన వెంటనే సర్‌ప్లస్ ఎస్జీటీల జాబితా, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం అనంతరం మండలస్థాయిలో కౌన్సెలింగ్‌పై వర్క్ అడ్జస్ట్‌మెంట్లు చేయనున్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



ఆర్టీసీ డిపో వద్ద నిరసన ప్రదర్శన

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 30: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ డిపో వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. డిపో కార్యదర్శి డీవీఎస్ఎన్‌టి.రాజు మాట్లాడుతూ ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కండక్టర్లు, డ్రైవర్లకు నైట్‌అవుట్ అలవెన్సులు పునరుద్ధరించాలని, జీవో నెంబర్ 114లోని అలవెన్సులను అమలు చేయాలని, సర్వీసులో చనిపోయిన ఉద్యోగుల అంత్యక్రియలకు రూ.25 వేలు ట్రెజరీ ద్వారా ఇవ్వాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీజీపీ రావు, టి.ఇశ్రాయేల్,సిహెచ్‌ఏవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై అధికారులు చర్యలు తీసుకోవాలి


కట్టడాలపై కార్యదర్శికి నేతల వినతిపత్రం

బుట్టాయగూడెం, ఆగస్టు 30: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా జరుగుతున్న అక్రమ కట్టడాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శివాలయం సమీపంలో అక్రమ కట్టడాలు చేపడుతున్నారని తెలుసుకున్న నాయకులు సంఘం ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం గిరిజన సంఘం నాయకులు అడ్డుకుని అధికారులకు చెప్పడంతో డీటీ రమేష్, ఆర్ఐ లక్ష్మి నిర్మాణాలను నిలుపుదల చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం, షాపింగ్ మాల్స్ నిర్మాణాలు గిరిజన చట్టాలకు విరుద్ధమన్నారు. ముప్పినవారిగూడెం సమీపంలో కొంతమంది అక్రమదారులు చట్టాలకు వ్యతిరేకంగా పంచాయతీ, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు లేకుండా పొగాకు బ్యారన్ల నిర్మాణాలు చేస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కోటనాగవరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రాన్ని అందజేశారు. కారం భాస్కర్ కుంజా నాగేంద్ర, తాటి మంగరాజు పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

టి.నరసాపురం, ఆగస్టు 30: సీజనల్ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి జె.కల్పనారాణి సూచించారు. వైద్య శిబిరంలో పలువురికి బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించడం అవసరమన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. జ్వరం ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యం పొందాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది నాగబాబు, ఎఎన్ఎం వెంకటలక్ష్మి, ఆశా వర్కర్లు లలిత, పలువురు ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి సభ్యత్వాల నమోదు కార్యక్రమం


సమావేశంలో మాట్లాడుతున్న విక్రమ కిశోర్

దెందులూరు, ఆగస్టు 30: బీజేపీ బలోపేతం చేయడానికి పార్టీ సభ్యత్వ నమోదుపై ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ కిశోర్ అన్నారు. గాలాయగూడెం మండూరి బుజ్జిగోపాల్ నివాసం వద్ద నియోజకవర్గ సమావేశం కన్వీనర్ గుమ్మడి వెంకట చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పార్టీ నాయకులు కార్యకర్తలు సమష్టిగా పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. కృష్ణప్రసాద్, పింగుల నాగ రామ్మోహనరావు, ప్రధాన కార్యదర్శి చీకటి ప్రభు చౌదరి, తోట అంజనేయులు, గుజ్జుల బాబురావు, నేతల ఏసోబు, జంగం జోజిబాబు, నాయకులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: సభ్యత్వ నమోదు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మండల ప్రముఖ్ కాకిలేటి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. నారాయణపురంలో బీజేపీ మండల సమావేశం వంజరపు దుర్గారావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది.సహ ప్రముఖ్‌లుగా అడపా శోభారాణి, గజ్జల నమ్మారావును నియమించారు.

సామూహిక వరలక్ష్మి వ్రతాలు


పత్తేబాద కనకదుర్గమ్మ

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 30: శ్రావణ మాసంలోని ఆఖరు శుక్రవారం నగరంలో అమ్మవారి ఆలయాల వద్ద సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. సౌభాగ్యలక్ష్మీదేవి ధనలక్ష్మిగా పూజలందుకున్నారు. పత్తేబాద కనక దుర్గమ్మకు తమలపాకులు, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. దక్షిణపువీధి మహిషాసుర మర్దినిదేవి, బాల త్రిపుర సుందరి, అగ్రహారం రాజ్యలక్ష్మీదేవి, కన్యకాపరమేశ్వరి, జ్ఞాన సరస్వతి, పవరుపేట కాశీ అన్నపూర్ణాదేవి, పత్తేబాదలోని కనకదుర్గమ్మ, చౌడేశ్వరిదేవి అమ్మవార్ల ఆలయాల వద్ద వరలక్ష్మివ్రతాలు చేశారు.

● పోలవరం: మండలంలో కనకదుర్గ ఆలయాల్లో ప్రత్యేక కుంకుమ పూజలు, వ్రతాలు నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి, ఏటిగట్టు సెంటర్ కనకదుర్గ, నూతనగూడెం, కృష్ణారావుపేట, బంగారమ్మపేట, పాతపట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాల, వెంకటాపురం, వింజరం ఆలయాలలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు, శ్రావణ శుక్రవార వ్రతాలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకారాల్లో కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల, ఆగస్టు 30: కుంకుళ్లమ్మ శ్రావణమాసం ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని భక్తులకు ప్రత్యేక అలంకారాల్లో దర్శనమిచ్చారు. ఆలయాన్ని పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటిబోదెలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. శ్రీవారి ఆలయ మార్గమధ్యలో కొలువైన అమ్మవారిని భక్తులు దర్శించి తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు.





ఏలూరులో మొక్కలు నాటుతున్న ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, ఎమ్మెల్యే బడేటి చంటి, జీలుగుమిల్లిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, దెందులూరు, చింతలపూడిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యేలు చింతమనేని, రోషన్‌కుమార్

మొక్క నాటుదాం

జిల్లాలో ఉత్సాహంగా వన మహోత్సవం

మొక్కలు నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు


కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటుతున్న జేసీ ధాత్రి రెడ్డి


జిల్లా పోలీస్ కార్యాలయంలో మొక్క నాటుతున్న ఎస్పీ కిశోర్

ఏలూరు రూరల్ / క్రైం / టూటౌన్, ఆగస్టు 30: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జేసీ పి.ధాత్రిరెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. జిల్లాలో 547 పంచాయతీల పరిధిలో 200 మొక్కలు చొప్పున నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. డీఆర్వో డి.పుష్పమణి, పరిపాలన విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ కేపీఎస్ కిశోర్, పోలీస్ అధికా రులతో కలిసి మొక్కలను నాటారు. ప్రతిఒక్కరు హార్టీకల్చర్, పచ్చదనం కలిగే మొక్కలను నాటి సంరక్షించాలని, ఆక్సిజన్ ఇచ్చి మన ప్రాణాలు కాపాడతాయన్నారు. ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఆర్ఐ పవన్ కుమార్ పలువురు పాల్గొన్నారు. ఏలూరు పంపుల చెరువు వద్ద ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ మొక్కలు నాటారు. నగర కమిషనర్ భానుప్రతాప్, చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్.పెదబాబు, ఎంఆర్‌డీ బలరామ్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీ పుట్టా మహేశ్ అన్నారు. మొక్కలు నాటడాన్ని ఉద్యమంగా చేపట్టాలన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో బండి ప్రణవి మొక్కలు నాటి నీరు పోశారు. సూపరింటెండెంట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం వన సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం దర్భగూడెంలో జనసేన స్థూపం ఆవిష్కరించారు. జి.రవికుమార్, సీహెచ్.ప్రసాద్, పి.రాము, కె.మధు, ఎస్.సాయి, తహసీల్దారు బి.సందీప్, సీఐ బి.వెంకటేశ్వరావు, ఎస్సై వి.వినయ్ కుమార్, ఎంఈవో శ్రీనివాస్, హెచ్‌ఎం చంద్రావతి, డి.సతీష్ రెడ్డి ఉన్నారు.

● చింతలపూడి: పర్యావరణ పరిరక్షణ, మనందరి బాధ్యతగా చెట్లు పెంచాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ప్రతి పల్లె, ప్రతి పట్టణంలో చెట్లు పెంచడం ఆరోగ్యదాయకమన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎంపీడీవో మురళీకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో డీఎల్ ప్రమద్వర మొక్కలు నాటారు.

● జంగారెడ్డిగూడెం: మొక్కలు నాటే సంప్రదాయం అలవాటు చేసుకోవాలని శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ ప్రజలకు సూచించారు. బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులు, అధికారులు, నాయకులతో మొక్కలు పెంచుతామని, పర్యావరణానికి హాని జరగకుండా చూస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం వద్ద షరీఫ్ మొక్కలు నాటారు. తహసీల్దార్ కె.స్లీవజోజి, కమిషనర్ జె.నరేంద్రకుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, కౌన్సిలర్లు నంబూరి రామచంద్రరాజు, కరుటూరి రమాదేవి, తెలగారపు జ్యోతి, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు రావూరి కృష్ణ, పెనుమర్తి రామకుమార్, తూటిగుంట రాము, షేక్ ముస్తఫా, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, కొప్పాక శ్రీనివాసరావు, పగడం సౌభాగ్యవతి, అంబేడ్కర్, బత్తిన చిన్నా, తదితరులు పాల్గొన్నారు. మండలంలో పలు చోట్ల మొక్కలు నాటే కార్యక్రమంలో దాసరి శ్యామ్‌చంద్ర శేషు, ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా, సర్పంచ్ యడ్లపల్లి రాధిక, పోల్నాటి శ్రీనివాసరావు, రావూరి కృష్ణ, డాక్టర్ రాంబాబు, డాక్టర్ సల్మా సుల్తానా, పెనుమర్తి రామకుమార్, గొల్ల మందల శ్రీనివాసరావు, టి.రామకృష్ణ, వింజమూరి కిరణ్, శీలం రామచంద్రరావు, వామిశెట్టి జగదీష్, ప్రగడ వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఇంకా మండలంలోని లక్కవరం, తాడువాయి, పేరంపేట, పంగిడిగూడెం తదితర గ్రామాలలో వన మహోత్సవం నిర్వహించారు.

● దెందులూరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో డాక్టర్ సుందర్‌బాబుతో కలిసి మొక్కలు నాటారు. మాగంటి మిల్లుబాబు, మోతుకూరి నాని, పసుమర్తి మధుబాబు, నాగనబోయిన సత్యనారాయణ, గారపాటి కొండయ్యచౌదరి తోట ఏసమ్మ బోడేటి మోహన్‌బాబు, యిప్పిలి వెంకటేశ్వరావు, పలువురు పాల్గొన్నారు.

● పోలవరం: మండలంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని అన్ని పంచాయతీల్లో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో జి.శ్రీను, సర్పంచ్‌లు పొడుం పుష్ప, మైగాపుల విజయదుర్గ, సబ్బారపు శ్రీరామ్మూర్తి, కలుం బాపిరాజు మొక్కలు నాటారు. తహసీల్దారు సోమరాజు, కొణతాల ప్రసాద్, బొరగం వెంకటలక్ష్మి, చెంచాని రత్నప్రసాద్, పోతులు శ్రీను, మజ్జి అప్పారావు, కోరశిక శ్రీనివాస్, వై.కొండలరావు, కార్యదర్శి అత్తిలి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: ప్రభుత్వ జూనియర్ కళాశాల, అంగనవాడీ కేంద్రంలో ఎంపీపీ కారం శాంతి మొక్కలు నాటారు. పచ్చదనం ప్రాముఖ్యతను పిల్లలకు చిన్ననాటినుంచే వివరించి మొక్కలను పెంచేవిధంగా వారిలో చైతన్యం కలిగించాలన్నారు. సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, కళాశాల ప్రిన్సిపాల్ జి.కుసుమ సంజీవని, ఈవోపీఆర్డీ శ్రీహరి, ఎంఈవో నరేంద్రరాయ్, సూపర్‌వైజర్ ఝాన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

● కామవరపుకోట: మండలంలోని పలు గ్రామాల్లో వన మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో కె.శ్రీదేవి, తహసీల్దార్ గెడ్డం ఎలీషా, ఏవో సత్యవాణి, మొక్కలు నాటారు. శాంతారామ్, పసుమర్తి పార్థసారధిబాబు, వేముల నాగేశ్వరరావు, బిరుదుగడ్డ నాగేశ్వరావు, తదితరులు బృందం మొక్కలు నాటారు.

● ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాలలో ప్రజా ప్రతినిదులు మొక్కలు నాటారు. ఉంగుటూరులో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, గ్రామాల్లో సర్పంచ్‌లు బండారు సింధు, దిడ్ల అలకనంద, రాందే లక్ష్మీ సునీత, పుత్సకాయల విష్ణు, సింహాద్రి శ్రీదేవి, సలగాల గోపి, మిద్దే సత్యవతి, కాళ్ళ సత్యనారాయణ, బళ్ళ రాధ, యేలేటి సునీత, తహసీల్దార్ బొడ్డేపల్లి దుర్గా ప్రసాద్, ఈవోపీఆర్డీ కాకర్ల వెంకట గిరిధర్‌ల ఆధ్వర్యంలో మొక్కలను నాటారు.

● కుక్కునూరు: మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల ప్రాంగణాల్లో ఉత్సాహంగా మొక్కలు నాటారు. అధికారులు, నాయకులు మాట్లాడుతూ పచ్చదనానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ఎంపీడీవో నరసింహరావు, తహసీల్దార్ పెద్దిరాజు, ములిశెట్టి నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, పిచ్చుక రాజు, ఎం.యుగంధర్, మంత్రి గోపాలకృష్ణ, లక్ష్మణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఆర్డీవో ఖాజావలి అన్నారు. భీమడోలులో ఆయన మొక్కలు నాటారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో మొక్కలు నాటుతున్నట్లు ఆయన తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ప్రత్తి మదన్, సర్పంచ్ పాము సునీత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● లింగపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో ఆశీర్వాదం, తహసీల్దార్ నజీముల్లాసా, డాక్టర్ యానిప్రీతి, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ కృష్ణకిషోర్, మొరంపూడి మల్లికార్జునరావు, గరిమెళ్ళ చలపతిరావు, గారపాటి బుజ్జియ్య, మొరంపూడి ప్రసాద్, రాయంకుల చక్రధర్‌రావు, కుర్రా సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్, తాతిన రాధాకృష్ణ, అసిలేటి అజయ్ పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: ఎంపీడీవో కార్యాలయం, పంచాయతీ వద్ద మండల ప్రత్యేకాధికారి బుజ్జిబాబు నాటారు. ప్రతీ గ్రామంలో ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని కోరారు. మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో మొక్కలు నాటారు. ఎంపీపీ గంజిమాల రామారావు, కొయ్యలగూడెం సర్పంచ్ ముప్పిడి విజయకుమారి, వైస్ ఎంపీపీ మట్టా వనజాలక్ష్మి, వివిధ గ్రామాల్లోని ఆయా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

● వేలేరుపాడు: వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో మొక్కలు నాటారు. తహసీల్దార్ డీవీ.సత్యనారాయణ, ఎంపీడీవో మూర్తి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఏడుకొండలు, ఎంపీపీ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

● టి.నరసాపురం: ఎంపీడీవో బీఎస్ఎన్ఎల్ మంగా కుమారి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. టి.నరసాపురం హైస్కూల్లో ఆర్డీవో కె.అద్దయ్య మొక్కలు నాటారు. నాగేంద్ర, ఎం.గోపాలరావు, జయవరపు శ్రీరా మూర్తి, శివమాధవి మొక్కలు నాటారు.

● ద్వారకాతిరుమల: మండలంలోని సచివాలయాలు, పాఠశాలల్లో అధికారులు, కూటమి నాయకులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్పెషల్ ఆఫీసర్ నెహ్రూబాబు, ఇతర అధికారులు పాల్గొని కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. హరిత యజ్ఞంలో పాలుపంచుకుందాం, ప్రతీ ఇల్లు, ప్రతీ ఊరు పచ్చదనంతో సింగారిద్దాం అంటూ ప్రతిజ్ఞ చేశారు.





జంగారెడ్డిగూడెంలో మొక్కలు నాటుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, భీమడోలులో గన్ని వీరాంజనేయులు, కొయ్యలగూడెం, టి.నరసాపురంలో మొక్కలు నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు

వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవ నిర్వహణపై హర్షం


మద్దుల జనార్దనరావు

ఏలూరు రూరల్, ఆగస్టు 30: వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకోవడంపై ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దుల జనార్దనరావు హర్షం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యుల మనోభావాలను గౌరవించి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం శుభపరిణామం అన్నారు. ఆర్యవైశ్యులకు చంద్రబాబు అన్ని విధాలుగా అండగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటికి కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వర్గాలకు టీడీపీ హయాంలో సముచిత న్యాయం జరుగుతుందని ఆకాంక్షించారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు


వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న లయన్స్ ప్రతినిధులు

దెందులూరు, ఆగస్టు 30: విశ్రాంత ఉపాధ్యాయుడు జరజారపు రంగారావు రూ 2 లక్షలతో ఉండ్రాజవరం గ్రామంలో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. వాటర్ ప్లాంట్‌ను చుక్కా అవినాష్‌రాజు శుక్రవారం ప్రారంభించారు. మాస్టార్ రంగారావును పలువురు ఘనంగా సన్మానించారు, ఈకార్యక్రమంలో ఉండ్రాజవరం గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఆర్ఆర్ డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల

ఏలూరు అర్బన్, ఆగస్టు 30: సీఆర్ఆర్ కళాశాల డిగ్రీ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను శుక్రవారం కళాశాల కరస్పాండెంట్ కొడాలి వెంకట సుబ్బారావు విడుదల చేశారు. పరీక్ష ఫలితాలను కళాశాల వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చని సూచించారు. ప్రిన్సిపాల్ రామరాజు, పరీక్షల కంట్రోలర్ విశ్వేశ్వరరావు, ఆనందరావు, రత్నాకర్, విజయలక్ష్మి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి చర్యలు

పెదపాడు, ఆగస్టు 30: గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఎంపీడీవో తేజరతన్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం శుక్రవారం జరిగింది. గ్రామాల వారీగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమీక్షించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల సంక్షేమమే అంగన్‌వాడీ లక్ష్యం

పెదవేగి, ఆగస్టు 30: చిన్నారుల సంక్షేమమే లక్ష్యంగా అంగన్‌వాడీ సిబ్బంది పనిచేయాలని సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి అన్నారు. పెదవేగిలో శుక్రవారం జరిగిన అంగన్‌వాడీ సెక్టార్ సమావేశంలో చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, పూర్వ ప్రాథమిక విద్యకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని పూర్వ ప్రాథమిక విద్యకు సిద్ధం చేయాలన్నారు. పిల్లల ఆరోగ్యానికి సంబంధించి ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా పిల్లల ఎత్తు, బరువు సరిచూడాలని ఆమె తెలిపారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, అంగన్‌వాడీ కేంద్రంలో పరిశుభ్రతను పాటించాలని, గర్భవతులు, బాలింతల ఆరోగ్యానికి సంబంధించి అవగాహన కల్పిస్తూ జాగ్రత్తలు చెప్పాలని వివరించారు. నిర్దేశించిన విధానంలో చిన్నారులకు ఆహారం అందించాలని పార్వతి తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సెట్‌వెల్‌లో 50 మందికి ఉపాధి కల్పన

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 30: స్థానిక సెట్‌వెల్ కార్యాలయంలో వివిధ సంస్థల కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహించారు. 32 మంది అభ్యర్థులను ఎంపిక చేసి వారికి నియామక పత్రాలను అందచేసినట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి మధుభూషణరావు తెలిపారు. జాబ్‌మేళాలో పలు సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఆయన వివరించారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు : చింతమనేని

పెదవేగి, ఆగస్టు 30: దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసిన దివ్యాంగులు వారి సమస్యలను వివరించారు. ప్రభాకర్ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్నివ్యవస్థలు నిర్వీర్యమయ్యాయన్నారు. దివ్యాంగుల సంక్షేమాన్ని జగన్‌రెడ్డి విస్మరించాడని, టీడీపీ కూటమి ప్రభుత్వంలో అంతా సంక్షేమమే ఉంటుందన్నారు. దివ్యాంగులకు అన్నింట్లో ప్రాధాన్యత ఉంటుందని, విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాల మెరుగుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ఆయన చెప్పారు. పార్టీనాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాస్, నంబూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి అందరూ కృషి చేయాలి

కుక్కునూరు, ఆగస్టు 30: మండలంలో సీపీఐ బలోపేతానికి ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. శుక్రవారం జిన్నెలగూడెంలో ఆ పార్టీ శాఖా సమావేశం జరిగింది. ఏజెన్సీలో సమావేశాలను పటిష్టంగా నిర్వహించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఏజెన్సీ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 6వ తేదీ వరకు నిత్యవసరాల ధరల పెంపు పై పార్టీ ఇచ్చిన ఆదేశాల మేరకు ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ కార్యదర్శి ఎం.వెంకటాచారి, కారం మారయ్య, ఐతా సురేష్, శ్యామలా, లక్ష్మయ్య, సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ థెరిసాలో తెలుగు వికాసంపై ప్రదర్శనలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 30: తెలుగు భాషాదినోత్సవాన్ని శుక్రవారం స్థానిక సెయింట్ థెరిసా మహిళా కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. విద్యార్థినులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ద్వారా తెలుగు వికాసాన్ని, వివిధ కాలాల్లో తెలుగు భాషాభివృద్ధికి కృషిచేసిన గురజాడ, కందుకూరి, గిడుగు, శ్రీశ్రీ, విశ్వనాథ, దాశరథి, దేవులపల్లి వంటి మహనీయుల సేవలను ప్రదర్శించారు. జానపదగేయ సాహిత్యాన్ని గురించి విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యరూపకాలు అందరినీ అలరించాయి. జానపద గేయాలలో లాలి పాటలు, వేడుక పాటలు, అప్పగింతలపాటలు, శృంగార గేయాలు, శ్రామికగేయాలు, హాస్యరస గేయాలు, కరుణరస గేయాలు హైలైట్‌గా నిలిచాయి. జాతి పురోగమన మార్గాన్ని తల్లిభాష ముందుండి నడిపిస్తుందని, ఇలాంటి తెలుగుభాషను రక్షించి అభివృద్ధి పథంలో నడిపించాలని విద్యార్థినులకు ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ పిలుపునిచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, అధ్యాపకులు డాక్టర్ ఫాతిమారాణి, డాక్టర్ మహాలక్ష్మి, అరుణ, అనూష, పరీక్షల కంట్రోలర్ సిస్టర్ సుశీల తదితరులు పాల్గొన్నారు.

దాడి సంఘటనలో ముగ్గురిపై కేసు

టి.నరసాపురం, ఆగస్టు 30: దాడి సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. మండలంలోని రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన మానికల గంగరాజు ఇంటి చుట్టూ క్లాత్ కడితే అదే గ్రామానికి చెందిన మానికల లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, నాగులు గొడవ పెట్టుకుని కొట్టి గాయపరిచారు. అతడిని చింతలపూడి ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి అందిన సమాచారంతో కేసు నమోదు చేశామన్నారు.

లక్కవరంలో ఏటీఎం ఏర్పాటు చేయాలి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 30: లక్కవరంలో ఏటీఎం, డిపాజిట్ మెషీన్ ఏర్పాటు చేయాలని యూనియన్ బ్యాంకు మేనేజర్‌కు ఖాతాదారులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. గ్రామ చుట్టు పక్కల 10 కిలోమీటర్ల మేర ఏటీఎం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పనులకు చెందిన కూలీ డబ్బు పొందడానికి ఏటీఎం అనువుగా ఉంటుందన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మంచి ఫలితాలు

కామవరపుకోట, ఆగస్టు 30: ప్రకృతి వ్యవసాయంతో మెరుగైన ఫలితాలు పొందవచ్చని ఇన్‌చార్జి షేక్ హుస్సేన్‌బి అన్నారు. తడికలపూడి క్లస్టర్ వీరిశెట్టిగూడెంలో శుక్రవారం వెయ్యి లీటర్ల జీవామృతాన్ని తయారు చేశారు. ఏటీఎం మోడల్ కూడా పరిశీలించారు. 29 యూనిట్ కేడర్లంతా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయంతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు అర్బన్ :** ఆహార నాళిక ఇన్ఫెక్షన్‌వల్ల ప్రాణాపాయస్థితికి చేరుకున్న వ్యక్తికి ఆయుష్ ఆస్పత్రిలో సకాలంలో వైద్యచికిత్సనందించి రోగిని కాపాడినట్టు ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ జాన్సి శుక్రవారం తెలిపారు.
- **ఏలూరు రూరల్ :** ఉప ముఖ్యమంత్రి, పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా రెడ్డిఅప్పలనాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పర్యావరణం పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సెప్టెంబర్ 2 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.
- కోటదిబ్బ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఈఈ నటరాజన్ తెలిపారు.
- **కుక్కునూరు :** సీపీఐ మండల కార్యదర్శి ఎం.వెంకటాచారి తండ్రి పాపాయ్య జ్ఞాపకార్థంగా జిన్నెలగూడెంలో ఉచిత మొక్కలను పంపిణీ చేశారు. జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య చేతుల మీదుగా గిరిజనులకు జామ, మామిడి రకాల 100 మొక్కలు పంపిణీ చేశారు.
- **ఉంగుటూరు :** రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శని వారం ఆనం కళా కేంద్రంలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం జరగ నుంది. బొమ్మిడి పాఠశాల ఉపాధ్యాయుడు బొమ్మిడి ప్రసాద్‌కు అవార్డును ప్రదా నం చేయనున్నట్లు నిర్వాహక కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా ఎంఈవో నిమ్మగడ్డ రవీంద్ర భారతి, ఏవీఎస్ఎన్.భాస్కర్ అభినందనలు తెలిపారు.
- **జంగారెడ్డిగూడెం :** బీజేపీ సభ్యత్వాల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర కిసాన్ మోర్చ మాజీ ఉపాధ్యక్షుడు అర్జుల మురళి పిలుపునిచ్చారు. శుక్రవారం పుట్లగట్లగూడెంలో సభ్యత్వాల నమోదు పారేపల్లి వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. తుమ్మలపల్లి బ్రహ్మాజీ, జి.రామచంద్రరావు, కె.నారాయణ, విజ్జు కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.
- **చింతలపూడి :** నియోజకవర్గంలో జడ్పీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ జడ్పీ సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. గ్రామీణరోడ్లు, మౌలిక సదుపాయాలు, రహదారి సౌకర్యాలు కల్పించాలని కోరినట్లు ఆయన తెలిపారు. సమస్యలను సానుకూలంగా మంత్రులు, కలెక్టర్ స్పందించారని పేర్కొన్నారు.



వనమహోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సారథి, కలెక్టర్





కైకలూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో, కలిదిండి పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవోలు



ముదినేపల్లిలో హరితాంధ్ర ప్రతిజ్ఞ

పచ్చందనమే.. పచ్చదనమే..

»గ్రామ గ్రామాన వన మహోత్సవం »మొక్కలు నాటిన అధికారులు »సంరక్షించాలని పిలుపు

పర్యావరణ పరిరక్షణకు అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు నడుం బిగించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. మొక్కలు సంరక్షిస్తామని ప్రతిన బూనారు.

కైకలూరు ఆగస్టు 30: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం వనమహోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే కైకలూరు సర్పంచ్ నవరత్న కుమారి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద, అటవీ అధికారుల ఆధ్వర్యంలో కైకలూరు ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే గ్రామగ్రామాన ఆయా పంచాయతీల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుట్టినరోజు, పెళ్ళిరోజులకు మొక్కలను నాటి వాటిని సంరక్షించుకునే బాధ్యత వారే తీసుకుంటే పర్యావరణానికి మేలు చేసినవారు అవుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవానికి మండలానికి 5 వేల మొక్కలను తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈవోపీఆర్డీ ఆర్. రవిశంకర్‌రావు, అటవీశాఖ డీఆర్వో జయప్రకాష్, కూటమి నాయకుడు వీరాబత్తిన సుధా తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి అవి చెట్లుగా పెరిగే వరకు సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ప్రత్యేకాధికారి బాబ్జి పేర్కొన్నారు. కానుకొల్లు జడ్పీ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం ఆయన మొక్క నాటి వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వై మాధవకుమార్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, సర్పంచ్ ఎస్ థామస్, ఎంపీడీవో రమణ, ఈవోపీఆర్డీ ఆనందబాబు, రిటైర్డ్ డైట్ ప్రిన్సిపాల్ జి వెంకటేశ్వరరావు, గుడివాడ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, ఎంఈఓ రామారావు తదితరులు పాల్గొన్నారు. మండవల్లి హైస్కూల్లో ఎన్డీఏ నాయకులు, విద్యాకమిటీ మాజీ చైర్మన్ ముళ్లపూడి సత్తిబాబు మొక్కలు నాటారు. హెచ్ఎం ప్రసాద్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యుడు ఎస్. విజయకుమార్ పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి మండల కార్యాలయాల కాంప్లెక్స్ ఆవరణలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, టీడీపీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, తహసీల్దార్ సుబానీ, ఎంపీడీవో మల్లీశ్వరి, ఎంఈవో నరేష్ కుమార్, ఏవో వేణుమాధవ్, ఉపాధి ఏపీవో నాగరాజు, వైస్ ఎంపీపీ రాచూరి సుకన్య, మండల పరిషత్ కార్యాలయ ఏవో రమణ బాబు, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ తదితరులు మొక్కలను నాటారు. అనంతరం మొక్కలను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. మండలంలోని పంచాయతీలు, గ్రామ సచివాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు తదితర ప్రదేశాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎస్ఎంసీ ఛైర్మన్లు, పంచాయతీలు, సచివాలయాల కార్యదర్శులు వనమహోత్సవాలను నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కలిదిండి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో దినతేజ్ అన్నారు. కలిదిండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. మండలంలో మొత్తం 23 పంచాయతీల్లో 4600 మొక్కలు నాటుతున్నారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, తహసీల్దార్ రామకృష్ణ, సర్పంచ్ మారుతి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు నియోజకవర్గంలో...

చాట్రాయి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఎంపీడీవో దుర్గాప్రసాద్, తహసీల్దార్ ప్రశాంతి, వైద్యాధికారి విజయలక్ష్మి కోరారు. శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పీఏసీఎస్, సచివాలయాల ఆవరణల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు మొక్కలు నాటారు. ఎంఈవో బ్రహ్మచారి, ఏవో శివశంకర్, ఏపీవో లక్ష్మీకుమారి, టీడీపీ నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, కందుల కృష్ణ, జె. ప్రదీప్, మారేశ్వరరావు, తల్లాడ శ్రీనివాసరావు, చంద్రకళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముసునూరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మియా, ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు అన్నారు. ముసునూరు సచివాలయం వద్ద టీడీపీ నాయకుడు కొండేటి ఉదయ్ కిరణ్, ఈవోపీఆర్డీ మొక్కలు నాటి, ప్రతిజ్ఞ చేశారు. అలాగే అక్కిరెడ్డిగూడెం ఎంపీపీ పాఠశాలలో సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీ సత్యనారాయణ, రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మానురాజు సురేష్, గ్రామ అధ్యక్షుడు బర్మా శ్రీనివాసరావు మొక్కలు నాటారు. చెక్కపల్లి గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ తల్లిబోయిన రాధికా సత్యనారాయణ, ఎంపీటీసీ తోట రమాదేవి మురళీకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ కె.సత్యనారాయణ మొక్కలు నాటారు. అలాగే రమణక్కపేట జడ్పీ పాఠశాలలో టీడీపీ నాయకులు రంగు శ్రీనివాసరావు, జనసేన నాయకులు పాశం నాగబాబు మొక్కలు నాటి, ప్రతిజ్ఞ చేశారు. 16 పంచాయతీల్లో పాఠశాలలు, రహదారుల పక్కన, సచివాలయ ప్రాంగణాలు తదితర ప్రదేశాల్లో సుమారు 3200 మొక్కలను నాటినట్లు ఈవోపీఆర్డీ తెలిపారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి సర్పంచ్ లక్ష్మీవిక్టర్ ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూలులో, తహసీల్దార్ కార్యాలయంలో మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే గాక వాటిని సంరక్షిస్తామని పంచాయతీ కార్యదర్శి బొల్లినేని ప్రసాద్ ప్రతిజ్ఞ చేయించారు. ఆగిరిపల్లి మండలంలో 25 గ్రామ పంచాయతీలకు 200 మొక్కల చొప్పున పంపిణీ చేశారు.



చాట్రాయి రైతు సేవా కేంద్రం వద్ద మొక్కలు నాటిన అధికారులు



ముసునూరు సచివాలయం వద్ద మొక్కలు నాటుతున్న ఈవోపీఆర్డీ



కానుకొల్లు హైస్కూల్లో మొక్కలు నాటుతున్న ప్రత్యేకాధికారి బాబ్జి



ఆగిరిపల్లిలో మొక్కలు నాటుతున్న అధికారులు

ప్రాథమిక పాఠశాలలపై సర్దు 'పోటు'

సింగిల్ టీచర్ స్కూళ్లుగా మారనున్న డబుల్ టీచర్ పాఠశాలలు



ముదినేపల్లి, ఆగస్టు 30 : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ కొత్త చిక్కు తెచ్చి పెట్టింది. కొన్ని పాఠశాలలు సింగిల్ టీచర్ స్కూళ్లుగా మారి పోతున్నాయి. మిగులు టీచర్ల అంశాన్ని నిర్ణయించేందుకు 20 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఇద్దరు టీచర్లు ఉంటే ఒక టీచరు సర్దుబాటు పరిధిలోకి వస్తున్నారు. రెండో టీచరును సర్దుబాటు పేరుతో వేరే పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపుతున్నారు. అయితే ఆగస్టు 9వ తేదీ తర్వాత విద్యార్థుల రోల్ పెరిగినా ఆ అంశాన్ని విద్యాశాఖ పరిగణలోకి తీసుకోవటం లేదు. ముదినేపల్లి మండలంలోని నాలుగు ప్రాథమిక పాఠశాలల పరిస్థితి ఇదే. మండలంలోని చినపాలపర్రు, పెదగరువు, అన్నవరం, శ్రీహరిపురం ప్రాథమిక పాఠశాలల్లో పై తేదీ నాటికి 18 నుంచి 20 మంది విద్యార్థులు ఉన్నారు. అనంతరం ఉపాధ్యాయుల కృషితో ప్రైవేట్ పాఠశాలల నుంచి కొంతమంది విద్యార్థులు చేరగా, ఆ సంఖ్య పై నాలుగు పాఠశాలల్లోను 22 నుంచి 24కు చేరింది. విద్యార్థుల రోల్‌ను ఆన్‌లైన్ చేయటం కూడా పూర్తయింది. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగి ఇద్దరు టీచర్లు ఉండాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఈ నెల 9వ తేదీకి ముందు రోల్ తక్కువగా ఉందన్న కారణంగా ఒక టీచరును సర్దుబాటుపై ఇతర పాఠశాలకు పంపనున్నారు. దీంతో ఆ పాఠశాలలు సింగిల్ టీచర్ స్కూళ్లుగా మారనున్నాయి. ఒక టీచర్ ఒకటి నుంచి 5 తరగతుల వరకు బోధించటం కష్టమైన ప్రక్రియ. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య పెరిగినందున రెండో టీచర్‌ను సర్దుబాటు నుంచి మినహాయించాలని ఉందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు.

ఎకో టూరిజం కేంద్రాలు కావాలి

నగర వనం ప్రారంభోత్సవంలో మంత్రి పార్థసారథి

నూజివీడు టౌన్, ఆగస్టు 30: నగర వనాలను ఎకో టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బత్తులవారిగూడెంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నగర వనాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడుతూ నగర వనాలను ఎకో టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చేయడం వల్ల పట్టణ వాతావరణానికి అలవాటు పడిన వారు కొంత సేదతీరేందుకు అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో ప్రకృతి రమణీయతకు పాపికొండలని చెబుతున్నారని నూజివీడులోని మామిడి, పామాయిల్ వనాలను చూస్తే ఇక్కడే ఉండిపోవాలనే ఆలోచన వస్తుందన్నారు. నూజివీడు నగర వనాన్ని మిని జూగా ఏర్పాటు చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. నూజివీడు ప్రాంతంలో వేలాది అటవీ భూములు ఉన్నా రెవెన్యూ, అటవీ భూముల మధ్య సరిహద్దు లేకపోవడంతో వివాదాలకు ఆస్కారం ఏర్పడుతోందని సరిహద్దుల ఏర్పాటుకు డీఎఫ్‌వో, కలెక్టర్ జాయింట్ సర్వే చేయాలని సూచించారు. అదే విధంగా ఆర్వో ఎఫ్ఆర్ పట్టాలున్న వారికి బోర్లు వేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అమ్మకు ఒక మొక్క అన్నారని, అలా కాక నాన్న పేరుతో కూడా సమ ప్రాధాన్యత ఇస్తే మరిన్ని హరిత వనాలను పెంచవచ్చన్నారు. గత ప్రభుత్వాలు వన మహోత్సవాన్ని నిర్లక్ష్యం చేసిందని కూటమి ప్రభుత్వం వనాలను పెంచేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ మనతో ఒక మొక్క అంటూ నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో శుక్రవారం లక్ష మొక్కలు నాటడం లక్ష్యమన్నారు. డీఎఫ్‌వో రవీంద్ర మాట్లాడుతూ నూజివీడులో నగర వనం పూర్తి కాగా తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, చింతలపూడిలలో నగర వనాలను పెంచేందుకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. జిల్లాలో పులుల సంచారం కనిపిస్తుందని సంచారం ఉన్న ప్రాంతాన్ని టైగర్ రిజర్వ్‌గా చేసేందుకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. నూజివీడు ఆర్డీవో వై.భవానిశంకరి, సర్పంచ్ ఎం. లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సారథి

వర్షంతో రైతుల హర్షం

కలిదిండి, ఆగస్టు 30 : వాతావరణంలో మార్పులతో భారీ వర్షం ఎండుతున్న పొలాలకు జీవం పోసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కోరుకొల్లు, సానారుద్రవరం, గోపాలపురం, వెంకటాపురం గ్రామాల్లో సుమారు 4 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. సాగునీటి ఎద్దడి ఏర్పడటంతో వరి పైరుకి నల్లి తెగులు సోకి ఎండిపోతోంది. ఈ పరిస్థితిలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవటంతో వరి పైరు కళకళలాడుతోంది. ప్రస్తుత వర్షాలతో వరి పైరుకు ఎంతగానో మేలు చేస్తుందని నల్లి తెగులు పోతుందని మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ తెలిపారు.

ఫ్రైడే-డ్రైడేతో వ్యాధులకు చెక్



మంకొల్లులో వైద్య శిబిరం

చాట్రాయి, ఆగస్టు 30: ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించటం వల్ల సీజనల్ వ్యాధులను సమూలంగా నిర్మూలించవచ్చునని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. మంకొల్లులో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు ఇంటింటికి వెళ్ళి ప్రజలతో మాట్లాడుతూ ఫ్రిజ్‌ల వెనుక భాగంలో, కూలర్లలో, వ్యర్థ ప్లాస్టిక్ వస్తువులు, టైర్లలో చేరిన నీటిని తొలిగించి దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. ప్రతి హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో జరుగుతున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, జ్వరం, నొప్పులు లాంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే పీహెచ్‌సీకి వచ్చి చికిత్స పొందాలని కోరారు.



క్రీడా పోటీలు

మండవల్లి, ఆగస్టు 30: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. హెచ్ఎం ప్రసాద్ అధ్యక్షతన క్రీడా దినోత్సవం ప్రాముఖ్యతను వ్యాయామోపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. విద్యాకమిటీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి సత్తిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండవల్లి జూనియర్ కళాశాలలో క్రీడా పోటీలు నిర్వహించా రు. విజేతలకు ప్రిన్సిపాల్ రవితేజ బహుమతలు అందజేశారు.

ద్వారకా తిరుమలలో వరలక్ష్మీ వ్రతాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 30: చిన్నతిరుమలేశుని దివ్యక్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో మహిళలు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. శ్రావణమాసం ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని అనివేటి మండపంలో దాదాపు రెండు వేలమంది ఈ వ్రతాల్లో పాల్గొన్నారు. ముందుగా వెండి తొళక్కం వాహనంపై వరలక్ష్మీ అమ్మవారిని ఉంచి అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేదమంత్రోచ్ఛరణల నడుమ అట్టహాసంగా అనివేటి మండప వేదిక వద్దకు తీసుకువచ్చారు. అలంక రించిన వేదికపై అమ్మవారిని ఉంచి హారతులు సమర్పించారు. భక్తిశ్రద్ధ లతో వ్రతాన్ని ఆచరించారు. మహిళలకు పసుపు, కుంకుమ, జాకెట్టు ముక్క, గాజులను పంపిణీ చేశారు.

క్రైం సమాచారం

కర్రతో దాడి.. ఒకరి మృతి



యలవర్తి రంగరావు (ఫైల్)

ముసునూరు, ఆగస్టు 30: మద్యం మత్తులో ఇద్దరి మధ్య జరిగిన గొడవ హత్యకు దారితీసిన ఘటన గురువారం రాత్రి గోపవరంలో చోటు చేసుకుంది. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోపవరం ఎస్సీ కాలనీకి చెందిన యలవర్తి రంగారావు, తిరువీధుల రంగారావు, కొండ్రుపాటి రంగారావు కలసి గురువారం రాత్రి మద్యం దుకాణానికి వెళ్లి మద్యం తాగారు. అనంతరం యలవర్తి రంగారావు, తిరువీధుల రంగారావు మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీయగా అక్కడున్న వారు ఇద్దరికీ సర్దిచెప్పి పంపారు. ఇంటికి వెళ్ళిన వీరిద్దరూ మరలా గొడవ పడ్డారు. ఘర్షణలో తిరువీధుల రంగారావు కర్రతో యలవర్తి రంగారావు(55) తలపై గట్టిగా కొట్టి హత్యచేశాడు. ఏఎస్ఐ నాగభూషణరావు, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. నిందితుడితోపాటు కొండ్రుపాటి రంగారావును పోలీసులు అదు పులోకి తీసుకున్నారు. శుక్రవారం నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించి, చుట్టుప్రక్కల వారిని విచారించారు. కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

డెంగీతో చిన్నారి మృతి

అత్తిలి, ఆగస్టు 30 : డెంగీతో చిన్నారి మృతి చెందింది.అత్తిలి గ్రామానికి చెందిన గోనా సుబ్బారావు కుమార్తె నిత్యశ్రీ పద్మ (6) అత్తిలి మదర్ మెర్సిల్లా పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. మూడురోజుల క్రితం పాపకు జ్వరం రావడంతో తణుకులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా డెంగీ జ్వరంగా నిర్ధారించి వైద్యం అందించారని, అయితే గురువారం బాలిక పరిస్థితి విషమించడంతో విజయవాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలిం చగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం బాలిక మృతి చెందిందన్నారు.

నేడు పెన్షన్ల పంపిణీని ప్రారంభించనున్న కలెక్టర్

కైకలూరు, ఆగస్టు 30: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని కైకలూరులో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి శనివారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం ఉదయం 5.30 గంటలకు కైకలూరు పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి పెన్షన్ల పంపిణీకి వెళతారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఎండీవో కోరారు.

ముదినేపల్లి: ముదినేపల్లి మండలంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఈవో మల్లీశ్వరి తెలిపారు. మండలంలోని 32 పంచాయతీల్లో 9020 మంది వివిధ రకాల పింఛన్‌దారులకు రూ.3.82 కోట్లు పెన్షన్ సొమ్మును పంపిణీ చేయనున్నట్లు, పూర్తి సొమ్మును బ్యాంకుల నుంచి శుక్రవారం డ్రా చేసినట్లు తెలిపారు. పెన్షన్ దారులు గ్రామ సచివాలయాలకు వె ళ్లనవసరం లేదని, సిబ్బంది పెన్షన్ దారులకు ఇంటి వద్ద సొమ్ము అందజేస్తారని ఎంపీడీవో తెలిపారు.

రేపు ఆవుల నియంత్రణపై సమావేశం

కైకలూరు, ఆగస్టు 30: కైకలూరు పట్టణంలో కొంతకాలంగా ఆవులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయని వాటిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు సెప్టెంబర్ 1న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు కైకలూరుకు చెందిన మద్దాలి రాంబ్రహ్మం తెలిపారు. ఆదివారం సాయంత్రం కైకలూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆవుల నియంత్రణ కోసం సమావేశాన్ని నిర్వహిస్తామని గో సంరక్షణ, ప్రమాదాలు నివారించాలని కోరేవారంతా సమావేశంలో పాల్గొని సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. మరిన్ని వివరాల కొరకు 99896 61424 నంబరులో సంప్రదించాలని కోరారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

కైకలూరు, ఆగస్టు 30: ఇరువర్గాలు కేసులు రాజీ చేసుకుంటే ఇరు పక్షాలు గెలిచినట్లేనని కైకలూరు సీనియర్ న్యాయసేవాధికారిణి వీవీఎస్‌వీ లక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ కోర్టులలోని కేసులను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు సెప్టెంబరు 14న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోర్టులో కేసులు ఉన్న కక్షిదారులు లోక్ అదాలత్‌లో రాజీ పడితే వారి సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు.



ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతులు

ముదినేపల్లి, ఆగస్టు 30 : ముదినేపల్లి మండలం వడాలి జడ్పీ హైస్కూల్‌లో 2023 - 24 విద్యా సంవత్సరంలో టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు దాతల విరాళాలతో నగదు బహుమతులు అందజేశారు. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన దీక్షితతో పాటు సుష్మ, అనంత ప్రకాష్, జశ్వంతి, జితేష్, మౌనికలకు ఒక్కొక్కరికి 10 వేల నగదు ప్రోత్సాహక బహుమతులను టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వి. నరసింహారావు, ఎస్ఎంసి సభ్యులు, హెచ్ఎం ప్రభుదాసు, ఉపాధ్యాయులు, సీఆర్పీ విజయదుర్గ పాల్గొన్నారు. విజయవాడ ప్రదీప్ ఆగ్రోఫామ్ ప్రొప్రయిటర్ ప్రదీప్ పాల్గొని ఉత్తమ విద్యార్థులకు మెమెంటో, మెడల్స్‌తో సత్కరించారు.

సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు పెట్టాలి

ముదినేపల్లి, ఆగస్టు 30 : ముదినేపల్లి మండలంలోని 32 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలను ఏర్పాటు చేయాలని ఎన్‌డీఏ కూటమి నాయకులు కోరారు. శుక్రవారం ముదినేపల్లి మండల ఈవోపీఆర్డీ లక్ష్మీ నారాయణకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆట్లూరి లోకేష్, కొత్తూరు వెంకట సుబ్బారావు, వేల్పూరి నానాజీ, మీసాల సత్యనారాయణ మెమొరాండం అందజేశారు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఆలయానికి రూ. లక్ష విరాళం

ఆగిరిపల్లి, ఆగస్టు 30: మండలంలోని తోటపల్లి గ్రామంలో గల దుగ్గిరాల రావమ్మ ఆలయానికి భక్తుల ఉపయోగార్థం గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మావిళ్ళపల్లి గ్రామ వాస్తవ్యులు ఈగ మధుసూదనరావు, రమాదేవి లక్షా ఐదువేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. వీరిని ఆలయ కార్యదర్శి సురేష్‌బాబు అభినందించారు.





కైకలూరు మీసాల వేంకటేశ్వర స్వామి.. ముదినేపల్లి సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



కైకలూరు వాసవీ మాత ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు

రావమ్మా మహాలక్ష్మి..

ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

కైకలూరు ఆగస్టు 30: శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం కావడంతో కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచి బారులు తీరారు. ఆలయ అర్చకులు చావలి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పుష్పాలంకరణకు మచిలీపట్నంకు చెందిన శ్రీశ్యామల గోల్డ్ కవరింగ్ వర్క్స్, ప్రసాదాన్ని చాపరాల భానుభాస్కర్, వరదా వెంకటశివరామకృష్ణకిషోర్, తోట పెద్దిరాజు సహకారం అందజేశారు. మీసాల వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను వికాస తరంగిణి సభ్యురాలు చిట్టి హేమలత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వందలాది మంది మహిళలు పాల్గొని పూజలు చేశారు. ఆలయ ఈవో వీఎన్‌కే శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రావణ మాసోత్సవాల ముగింపు సందర్భంగా కైకలూరు వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దయెత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కొప్పర్తి గోపాలకృష్ణ, చొప్పర్ల మురళీకృష్ణ, సమయమంతుల రాజా, గుర్రం శ్యాంకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

కలిదిండి: కలిదిండి వరలక్ష్మీ అమ్మవారి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. గుర్వాయిపాలెం లక్ష్మీదేవి ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేయగా సమరసత సేవా ఫౌండేషన్ భక్తులకు లక్ష్మీ రూపులను పంపిణీ చేశారు. మూల్లంక పెద్దింటమ్మ ఆలయంలో అమ్మవారికి పెద్దయెత్తున మహిళలు పూజలు చేశారు.

ముదినేపల్లి: సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా జరిగాయి. పలు ప్రాంతాల నుంచి సుమారు 260 మంది మహిళలు వ్రతాల్లో పాల్గొన్నారు. అసిస్టెంట్ కమిషనర్ ఎస్.సంధ్య తొలుత అమ్మవారికి పూజలు చేసి వరలక్ష్మీ వ్రతాలను ప్రారంభించారు. వ్రతాలు నిర్వహించిన మహిళలకు ఆలయం తరఫున పసుపు, కుంకుమ, జాకెట్ ముక్కలు, గాజులు పంపిణీ చేశారు. అర్చకుడు గూడూరు రామకృష్ణ శర్మ, తోలేటి వీరభద్ర శర్మ, అమ్మవారికి వ్రతాలు జరిపించారు. అనంతరం ఆలయ ఆవరణలో వన మహోత్సవం నిర్వహించి ఏసీ సంధ్య మొక్కలు నాటారు.

ఆగిరిపల్లి: కనసానపల్లిలోని బాలా త్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో 4వ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు ప్రధాన అర్చకుడు సాయి స్వరూప్ తెలిపారు.



ప్రింటర్‌ను అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

పాఠశాలకు ప్రింటర్ వితరణ

కైకలూరు ఆగస్టు 30: మండలంలోని పల్లెవాడ ఎంపీ యూపీ స్కూల్‌కు ఆకివీడు లయన్స్ క్లబ్ సభ్యులు ప్రింటర్‌ను అందజేశారు. శుక్రవారం పాఠశాలలో లయన్ మత్తి రమేష్, శ్రీనివాస్ వారి తండ్రి లక్ష్మీనారాయణ స్మృత్యర్థం రూ.18వేలు విలువగల ప్రింటర్‌ను హెచ్ఎం సుబ్రహ్మణ్యంకు అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు రాజేశ్వరీ, కార్యదర్శి జ్యోతిరెడ్డి, కోశాధికారి మణి, రీజియన్ అధ్యక్షులు జి. కృష్ణమూర్తి, కార్యదర్శి ఎన్. రమేష్, సర్పంచ్ దుట్టా మణి, మాజీ ఎంపీటీసీ నత్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు నున్న మహాలక్ష్మణుడు, మేడూరి నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.